ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 విశాఖపట్నం జిల్లా వార్తలు

బుధవారం 30 ఏప్రిల్ 2025





చందనోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పీహెచ్‌డీ ప్రవేశాల్లో జాప్యం

- గత ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన నెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇప్పటికీ ప్రవేశాలు కల్పించని ఏయూ
- ఏడాది వృథా అవుతోందని ఆందోళన
- డిసెంబరులో జరిగిన నెట్ ఫలితాలు కూడా వెల్లడి



విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ఎంతోమంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. గడిచిన ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన యూజీసీ నెట్ (జాతీయ అర్హత పరీక్ష)లో అర్హత సాధించిన పలువురు... ప్రవేశాల ప్రక్రియ జాప్యం కావడంపై ఆందోళన చెందుతున్నారు. యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు యూజీసీ నిర్వహించే నెట్ స్కోర్ ద్వారా చేపట్టాలని గత ఏడాది ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు జనవరి రెండో తేదీన నోటిఫికేషన్, షెడ్యూల్ కూడా విడుదల చేశారు. అయితే, నెలలు గడుస్తున్నా అధికారులు అడ్మిషన్ల ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లక పోవడంతో అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు వర్సిటీలో జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్), పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులకు జేఆర్ఎఫ్‌గా, మిగిలిన వారు పీహెచ్‌డీ ప్రవేశాలు పొందేందుకు అవకాశం ఉంటుంది. అయితే, నెలలు గడుస్తున్నా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టకపోవడం వల్ల ఏడాది సమయం వృథా అయిపోతోందని చెబుతున్నారు. రెండేళ్లలో ప్రవేశాలు

... మిగతా 6వ పేజీలో



నేటి సంచికతో సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి 'చందనోత్సవం' ప్రత్యేక అనుబంధాన్ని అందుకోగలరు.
-ఎడిటర్



విద్యుద్దీప కాంతుల్లో సింహగిరి



సింహగిరికి ఉత్సవ శోభ

నేడే చందనోత్సవం

భక్తులకు నిజరూపంలో దర్శనమివ్వనున్న అప్పన్న

- తెల్లవారుజామున 4 గంటల నుంచి అవకాశం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- విద్యుద్దీపాలతో దేవస్థానం, రాజగోపురం, పరిసర ప్రాంతాల అలంకరణ

సింహాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):

ఏడాది పొడవునా చందనపు పైపూతతో పూజలందుకునే సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి బుధవారం ద్వయావతారుడిగా తన నిజరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అపురూపమైన స్వామి నిజరూప దర్శనం (చందనోత్సవం) కోసం లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. అందుకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చందనోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటి గంటకు సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలుపుతారు. 1.30 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము, తదితరాలు నిర్వహిస్తారు. ఆ తరువాత ఏడాది పొడవునా స్వామి వారిపై పూతగా ఉండే చందనాన్ని తొలగించి, ప్రభాత ఆరాధన చేస్తారు. బుధవారం తెల్లవారుజామున 3.00 గంటలకు ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులకు తొలిదర్శనం కల్పిస్తారు. 3.30 గంటల నుంచి 4 గంటల నడుమ ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున సంప్రదాయ వస్త్ర సమర్పణలు ఉంటాయి. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. స్వామి దర్శనం కోసం అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల నుంచి భక్తులు వందలాది మంది

... మిగతా 6వ పేజీలో



అప్పన్న నిజరూప దర్శనం కోసం మంగళవారం సాయంత్రం నుంచే క్యూలైనులో వేచివున్న భక్తులు

చందనోత్సవ టిక్కెట్లకు డిమాండ్

- సాధారణ భక్తులకు అందని రూ.వేయి టిక్కెట్లు
- సిఫారసు చేయించుకున్న వారికే...
- అందుబాటులో లేని దేవస్థానం ఈఓ
- కార్యాలయం వద్ద పలువురి ధర్నా
- ఎమ్మెల్యేలకు ఏడేసి పాస్‌లు
- రూ.1,500 టిక్కెట్లు 50 చొప్పున, రూ.1,000 టిక్కెట్లు 150 చొప్పున కేటాయింపు
- వెహికల్ పాస్‌లు రాత్రి ఏడు గంటలకు ముద్రణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

చందనోత్సవం రోజున అప్పన్న దర్శన టికెట్ల కోసం ఈసారి ఎన్నడూ లేనంత డిమాండ్ కనిపించింది. సామాన్య భక్తులకు వేయి రూపాయల టిక్కెట్ దక్కకుండా చేశారు. అన్ని టిక్కెట్లు సిఫారసు చేయించుకున్న వారికే ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొందరు టిక్కెట్ల కోసం మంగళవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఈఓ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఇక ప్రజా ప్రతినిధులు, ప్రొటోకాల్ వ్యక్తులు సొంత కార్లలో కొండపైకి వెళ్లడానికి వాహన పాస్‌లు జారీచేస్తామని ప్రకటించారు. వాటిని కూడా రాత్రి ఎనిమిది గంటలకు ముద్రించలేదు. కొండపైకి వచ్చే ప్రైవేటు వాహనాల సంఖ్య తగ్గించడానికి ఈ విధంగా వ్యవహరించారు. కొండ దిగువన వీఐపీల కోసం ఇన్నోవా కార్లు, ఏసీ బస్సులు ఏర్పాటుచేశారు.

సింహాచలంలో ఈఓ కార్యాలయం వద్ద టికెట్ల జారీలో గందరగోళం సృష్టించారు. ఈఓ ఎవరికీ అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. అయితే ఇదంతా వ్యూహాత్మకంగానే చేశారంటున్నారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారికి గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉండడంతో టిక్కెట్లు ఎడాపెడా ఇవ్వకుండా కట్టడి చేశారు. ఈ చర్యల వల్ల సామాన్య భక్తులకు సులభ దర్శనం జరిగితే మంచిపని చేసినట్టే.

ఎమ్మెల్యేలకు 1+6 అంతరాలయ దర్శన టిక్కెట్లు

విశాఖ జిల్లాలోని ఎమ్మెల్యేలకు అంతరాలయ దర్శనం చేసుకునేందుకు ఏడు టిక్కెట్లు (1+6...ఒకటి ఎమ్మెల్యేకు, కుటుంబ సభ్యుల కోసం ఆరు) చొప్పున ఇచ్చారు. ఇవి కాకుండా రూ.1,500 విలువ కలిగిన టిక్కెట్లు 50 చొప్పున, వేయి రూపాయల విలువైన

... మిగతా 6వ పేజీలో

పెరుగుతున్న ఆశావహులు

డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమిలో తీవ్ర పోటీ

- తమకు వదిలేయాలని కోరుతున్న టీడీపీ ప్రజా ప్రతినిధులు
- ససేమిరా అంటున్న జనసేన కార్పొరేటర్లు
- నేతలకు తలనొప్పిగా మారిన సామాజిక సమీకరణాలు
- ఈవారంలోనే ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పదవి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్లు పోటీపడుతున్నారు. నాలుగేళ్లు డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన జియ్యాని శ్రీధర్‌పై కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆయన పదవిని కోల్పోయారు. ఖాళీ అయిన ఆ పోస్టులో కొత్తగా డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. ఇందుకోసం ఈ వారంలో నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. ఆ పదవి కోసం మూడు పార్టీల నుంచి పోటీ ఎక్కువగా ఉంది. దీంతో అవకాశం ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది.



మేయర్ పదవిని టీడీపీ తీసుకున్నందున డిప్యూటీ మేయర్ పదవిని తమకు ఇవ్వాలని జనసేన కార్పొరేటర్లు కొందరు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో టీడీపీ నుంచి పలువురు కార్పొరేటర్లు ఆ పోస్టును ఆశిస్తున్నారు. టీడీపీ ప్రజా ప్రతినిధులు సైతం డిప్యూటీ మేయర్ పదవిని తమ పార్టీకి వదిలేయాలని జనసేన, బీజేపీ ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. అందుకు జనసేన కార్పొరేటర్లు ససేమిరా అంటున్నా...ముగ్గురు ఎమ్మెల్యేలు అంగీకరించినట్టు ప్రచారం జరిగింది. దీంతో డిప్యూటీ మేయర్ పదవి టీడీపీదేనని అంతా భావించారు. ఇంతలో జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్ మంగళవారం అమరావతిలో పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి రాష్ట్రంలో కీలకమైన విశాఖలో పార్టీ బలపడేందుకు వీలుగా డిప్యూటీ మేయర్ పదవిని కోరాలని విజ్ఞప్తి చేస్తూ లేఖ అందజేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో తిరిగి ఆ పార్టీ డిప్యూటీ మేయర్ పదవికి రేస్‌లోకి వచ్చినట్టయింది.

తలనొప్పి పుట్టిస్తున్న సామాజిక సమీకరణాలు

డిప్యూటీ మేయర్ పదవిని ఎవరికో ఒకరికి ఇచ్చేద్దామనుకున్నా సరే నేతలకు సామాజిక సమీకరణాలు తలనొప్పి పుట్టిస్తున్నాయి. యాదవ సామాజిక వర్గానికి

... మిగతా 6వ పేజీలో

నేడు పాలీసెట్

- 9,383 మంది విద్యార్థులు... 22 కేంద్రాలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

కంచరపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించే 'పాలీసెట్' బుధవారం జరగనుంది. పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పాలీసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు వెల్లడించారు. జిల్లాలో గల భీమునిపట్నం, పెందుర్తి, విశాఖ అర్బన్ రీజియన్స్ నుంచి 9,383 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని, వారి కోసం 22 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష జరగనున్నది. పది గంటల నుంచి విద్యార్థులను కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. 11 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలకు అనుమతించబోమని, ఈ విషయం విద్యార్థులు గమనించి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని నారాయణరావు సూచించారు.

ఆరోగ్య శాఖ నియామకాలపై విచారణ

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) పోస్టుల భర్తీలో రోస్టర్ ప్రక్రియను సరిగా పాటించలేదంటూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ నియమించిన కమిటీ మంగళవారం విచారణ చేపట్టింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో 2003లో 148 పోస్టులను భర్తీచేశారు. ఆ పోస్టుల భర్తీలో రోస్టర్‌తోపాటు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోలేదంటూ ఒకరు ఫిర్యాదు చేశారు. దానిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ విచారణ నిమిత్తం సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి, జిల్లా ఉపాధి కల్పన అధికారి సుబ్బారెడ్డిలతో కమిటీ వేశారు. ఈ కమిటీ మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి వెళ్లి అప్పటి నియామకానికి సంబంధించిన ఫైళ్లను పరిశీలించింది. ఆరోగ్యశాఖ అధికారులతోపాటు ఫిర్యాదుదారుడితో కమిటీ సభ్యులు మాట్లాడి పలు వివరాలను సేకరించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నారు. మరోసారి కమిటీ కార్యాలయానికి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

జీవీఎంసీ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

- అధికారులకు మేయర్ ఆదేశాలు



విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, యువత కోసం వేసవిలో క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు నిర్ణయించారు. దీనికోసం రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావుతోపాటు అధికారులతో మంగళవారం చర్చించారు. చిన్నారులు, యువతకు గత ఏడాది మాదిరిగానే 33 క్రీడాంశాల్లో నిపుణులైన వారితో శిక్షణ ఇప్పించాలని, శిబిరాల ఏర్పాటు, నిధుల వ్యయం పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. వచ్చే నెల నాలుగో తేదీన క్రీడా సంఘాలు, కోచ్‌లతో సమావేశం ఏర్పాటుచేద్దామని, వారి సలహాలు, సూచనల ప్రకారం శిక్షణ శిబిరాలకు సంబంధించిన కార్యచరణ విడుదల చేద్దామని మేయర్ వివరించారు.

దంపతుల హత్య కేసులో పోలీసులకు క్లూ?

- గోడలపై గ్రీజు మరకలు గుర్తింపు
- తెలిసినవారే చేశారని పిల్లల అనుమానం

విశాఖపట్నం/కూర్మన్నపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజోతి): దువ్వాడ సమీపాన రాజీవ్‌నగర్‌లో ఐదు రోజుల క్రితం జరిగిన వృద్ధ దంపతుల హత్యకు సంబంధించి పోలీసులకు కొన్ని ఆధారాలు లభించినట్టు సమాచారం. వాటి ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. రిటైర్డ్ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగి గంపల యోగీంద్ర బాబు (66), ఆయన భార్య లక్ష్మి (52)ని గుర్తు తెలియని వ్యక్తులు కిరాతకంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఒకరోజు తరువాత హత్యోదంతం బయటపడింది. వారి పిల్లలు శిల్ప, సుజిత్ ఇద్దరూ అమెరికాలో ఉంటున్నారు. తల్లిదండ్రుల మరణవార్త విని శనివారం ఇక్కడకు చేరుకున్నారు. మృతదేహాలను చూసి తీవ్ర ఆవేదన చెందారు. అత్యంత కిరాతకంగా చంపారని, ఎంతో కక్ష ఉంటే తప్ప అలా చేయరని వ్యాఖ్యానించారు. మరోవైపు ఇది బంగారు నగలు, డబ్బు కోసం చేసిన హత్య కాదని పోలీసులు తేల్చారు. కనిపించకుండా పోయిన లక్ష్మి బంగారు గాజులు కూడా లభించాయని పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. ఇంట్లో గోడలపై గ్రీజు మరకలను గుర్తించారు. మెకానిక్‌లు కొందరు ఆ ఇంటికి వచ్చి వెళ్లేవారని తెలిసి ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇంట్లో రెండు పడక గదులు ఉండగా, వాటికి

... మిగతా 6వ పేజీలో

నైపుణ్యం ఉంటేనే మెరుగైన ఉపాధి అవకాశాలు

» అమర్‌రాజా ఉద్యోగ మేళాలో విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్

సాగర్‌నగర్, ఎండాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్యాలు లేకపోతే చేతిలో డిగ్రీ పట్టా ఉన్నా గౌరవ ప్రదమైన ఉద్యోగాలు సాధించడం ప్రస్తుత రోజుల్లో యువతకు అవరోధంగా మారుతోందని విశాఖ పార్లమెంటు సభ్యుడు గీతం యూనివర్సిటీ అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా 'అమర్‌రాజా' సంస్థ మంగళవారం నిర్వహించిన ఉద్యోగమేళాలో ఆయన పాల్గొని ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. పదో తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్ డిప్లొమా అర్హత గల వారికి అమర్‌రాజా సంస్థ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఉన్నత చదువులు డిగ్రీలు చేతిలో ఉన్నా నైపుణ్యాలు లేక తడబడుతున్న యువతరానికి తగిన శిక్షణ ద్వారా అవకాశాలను పెంచుకోవచ్చన్నారు యువతరం అమర్‌రాజా వంటి సంస్థలు ఇచ్చే శిక్షణ పొందడం ద్వారా అదనపు అర్హతలను సాధించాలని, తద్వారా జాబ్ మార్కెట్లో మంచి ఉపాధి అవకాశాలు పొందే వీలుంటుందన్నారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలు అందించే వివిధ శిక్షణ కార్యక్రమాల పనితీరును త్వరలో మదింపు చేస్తామని తెలిపారు. అమర్‌రాజా సంస్థలో ఉద్యోగాలు సాధించిన వారిని అభినందించారు.



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన ఎంపీ శ్రీభరత్

అంతకుముందు ఉదయం జరిగిన ఉద్యోగ మేళా ప్రారంభోత్స కార్యక్రమంలో గీతం ప్రో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువతీ యువకులకు దిశానిర్దేశం చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ పాల్గొని ప్రసంగించారు. అమర్‌రాజా సంస్థ నియామక విభాగం సీనియర్ అధికారి కల్యాణ్ మాట్లాడుతూ విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ చొరవతో స్థానిక యువతకు అవకాశాలను కల్పించడానికి తమ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. సంస్థలో వివిధ ఉద్యోగావకాశాలు పని సంస్కృతి, శిక్షణ కార్యక్రమాలు, నైపుణ్యం కనబరిచే వారికి అందించే ప్రోత్సాహకాలను వివరించారు.

ఈ ఉద్యోగ మేళాకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మూడువేల మంది యువత తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. ఉదయం నుంచే అభ్యర్థులు పెద్ద ఎత్తున గీతం ప్రాంగణానికి చేరుకొన్నారు. ఇంటర్వ్యూల నిర్వహణకు గీతంలోని వివిధ విభాగాల్లో ఏర్పాటు చేశారు. మొత్తం 1172 మందిని ఎంపిక చేసినట్టు అమర్‌రాజా ప్రతినిధులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంత పెద్దఎత్తున ఒకే జిల్లాలో నియామకాలు జరిపి యువతను ఉద్యోగాలకు ఎంపిక చేయడం ఇదే ప్రథమం అన్నారు.

భీమిలి బార్ అసోషియేషన్ నూతన కార్యవర్గం



బార్ అసోషియేషన్ కార్యవర్గ ప్రతినిధులు

భీమునిపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భీమిలి కోర్టు బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా సీనియరు అడ్వకేట్ ఎస్.జనార్ధనరావు ఎన్నికయ్యారు. మంగళవారం ఆ కోర్టులో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా ఎస్.సురేష్‌రెడ్డి వ్యవహరించారు. ఆయన తెలిపిన వివరాలిలావున్నాయి. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కె.మంజుల, కోశాధికారిగా జి.రామారావు, సంయుక్త కార్యదర్శిగా డి.కనకమహాలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్‌గా బమ్మిడి సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా వి.అరుణకుమారి, జి.ప్రశాంతి, బి.అప్పలరాజు ఎన్నికయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎన్నికలు జరిగాయి. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

ఘనంగా పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు



సాగర్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు గత నాలుగు రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జాతర మహోత్సవాల సందర్భంగా బంధుమిత్రులను ఇళ్లకు ఆహ్వానించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని పండుగ చేసుకోవడం రుషికొండ వాసులకు ఆనవాయితీగా వస్తోంది. ఉప్పాడ ప్రాంతం నుంచి పోలమాంబ అమ్మవారిని కాలినడకన బాజా భజంత్రీలతో ఊరేగింపుగా తీసుకువచ్చి రుషికొండ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో అమ్మవార్లకు వేదమంత్రోచ్ఛరణలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయం ఎదురు ఉన్న రహదారి నుంచి బీచ్‌రోడ్డు వరకు పరస జరిగింది. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీకరణ, బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఆలయ కమిటి పర్యవేక్షణలో జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.

పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకే కమిటీల్లో ప్రాధాన్యం

» టీడీపీ యువనేత గంటా రవితేజ



కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న గంటా రవితేజ

భీమునిపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకే సంస్థాగత కమిటీల నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుందని టీడీపీ యువనేత గంటా రవితేజ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో భీమిలి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తలతో రవితేజ సమావేశమై కమిటీల నియామకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ ఎన్నికలలో పార్టీ విజయానికి కష్టించి పని చేసిన నేతలు, కార్యకర్తలను గ్రామ, మండల, వార్డు పార్టీ కమిటీల నియామకాల్లో గౌరవించాలన్నారు. అలాగే, పార్టీ అనుబంధ సంఘాలలో నియమించిన కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతమే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. పార్టీ కమిటీల నియామక ప్రక్రియలో ఎటువంటి తారతమ్యాలు, పక్షపాతానికి తావులేకుండా పార్టీ విధి విధానాల ప్రకారమే జరపాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణ కలిగిన పార్టీగా తెలుగుదేశానికి ఉన్న గుర్తింపును ప్రతి కార్యకర్త గుర్తుంచుకోవాలని కోరారు. కమిటీల నియామకాలు పార్టీ గౌరవాన్ని పెంచేలా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాలతో పాటు జీవీఎంసీ 1 నుంచి 8, 98వ వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను ఎవరూ మర్చిపోలేరు : డీఈవో ప్రేమ్‌కుమార్

తగరపువలస, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సేవలను అందించి విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు ఎల్లకాలం విద్యార్థుల మదిలో ఉండిపోతాడని జిల్లా విద్యాశాఖాధికారి పి.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం తగరపువలస ఫంక్షనుహాలులో జరిగిన చిట్టివలస గెజిటెడ్ హెచ్‌ఎం పి.మురళీమోహనరావు సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో చదువు చెప్పిన ఉపాధ్యాయులను ప్రతివారు జీవితాంతం గుర్తుంచుకుంటారని అన్నారు.

కార్మిక చట్టాల అమలుపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

తగరపువలస, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కుల పరిరక్షణకు కొత్త కార్మిక చట్టాలను చేయాలని, ఉన్న వాటిని సక్రమంగా అమలు చేయాలని రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం చిట్టివలస సీఐటీయూ కార్యాలయం వద్ద ఆ సంఘ నేతలు ఆవిష్కరించారు. ఇక్కడున్న కార్యాలయంలో సర్వసభ్యసమావేశం నిర్వహించిన అనంతరం ఈ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా నాలుగు కార్మిక చట్టాలను తీసుకొచ్చి కార్మికుల్ని బానిసలుగా మార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. కార్మికులకు అనుకూలమైన కొత్త చట్టాలను తీసుకుని రావాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న అఖిల భారత కార్మికులు తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, నాయకులు నర్సింగరావు, మహిళా సంఘం నాయకులు కె.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

సింహగిరికి ఉత్సవ శోభ

... 5వ పేజీ తరువాయి

మంగళవారం సాయంత్రానికి సింహగిరికి చేరుకున్నారు. దేవస్థానం ఏర్పాటుచేసిన ఉచిత దర్శనం క్యూలో వేచిఉన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం అధికారులు రంగురంగుల విద్యుత్ దీపాలతో సింహగిరిని శోభాయమానంగా అలంకరించారు. అదేవిధంగా క్యూలను గతంకంటే ఎక్కువగా నిర్మించారు. ఎక్కడికక్కడ తాగునీటి సదుపాయం కల్పించారు. అనేకచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. దివ్యాంగులను సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ దర్శనానికి అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం సింహగిరిపై పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్యూలు, బారికేడ్లు, మజ్జిగ, తాగునీటి పంపిణీ వంటి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సూచిక బోర్డులను ఎక్కువసంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కొండ దిగువన కొత్తఘాట్‌రోడ్డు, న్యూగోశాల, పాత గోశాల రోడ్లలో ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, దేవదాయ శాఖ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. పార్కింగ్ ప్రాంతాలను, సైన్‌బోర్డులను చూడడంతో పాటు పోలీసు కంట్రోల్ రూమ్ వ్యవస్థపై కూడా పలు సూచనలిచ్చారు.

చందనోత్సవ టిక్కెట్లకు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

టిక్కెట్లు మరో 150 చొప్పున ఇచ్చారు. అంతరాలయ దర్శన టిక్కెట్లు ఇంకా కావాలని కొందరు పట్టుబట్టగా ఇవ్వలేమని అధికారులు స్పష్టంచేశారు. అధికారుల అంచనా ప్రకారం ప్రొటోకాల్ ద్వారా సుమారుగా మూడు వేల మందికి అంతరాలయ దర్శనం జరిగే అవకాశం ఉంది. ఉదయం ఆరు తరువాత అంతరాలయ దర్శనం ఉండదని ప్రకటించినా నాలుగు గంటలకు ప్రారంభించి ఆరు గంటలలోపు దర్శనాలు ముగించడం సాధ్యం కాదు. కాబట్టి ఉదయం పది గంటల వరకూ వీఐపీలు, అంతరాలయ దర్శనాలు ఉండవచ్చునంటున్నారు.

ప్రణాళిక విజయవంతమైతే మేలు చేసినట్టే

గత ఏడాది ఎన్నికల కోడ్ వల్ల అధికారులకు ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం తప్పింది. దాంతో ఊపిరి పీల్చుకొని సామాన్య భక్తులకు రెండు గంటల్లో దర్శనం చేయించగలిగారు. ఈసారి వ్యూహాత్మకంగా వ్యవహరించినందున సామాన్య భక్తులకు సులువుగా దర్శనం జరగాల్సి ఉంది. ఈ ప్రణాళిక విజయవంతమైతే అధికారులు భక్తులకు మేలు చేసినట్టే.

పెరుగుతున్న ఆశావహులు

... 5వ పేజీ తరువాయి

చెందిన మహిళను తాము మేయర్‌ను చేస్తే ఇస్తే ఆమెను తొలగించి వేరొక సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్‌కు ఆ పదవిని ఇచ్చారంటూ వైసీపీ నేతలు విమర్శలు ప్రారంభించారు. ఆ విమర్శలను తిప్పికొట్టాలంటే డిప్యూటీ మేయర్ పదవిని యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళకు ఇవ్వాలని కూటమి ప్రజా ప్రతినిధులు భావిస్తున్నారు. ఆ సామాజిక వర్గానికి చెందిన మహిళా కార్పొరేటర్లు టీడీపీలో మొల్లి హేమలత (5వ వార్డు), గొలగాని మంగవేణి (18 వార్డు), జనసేనలో పుర్రె పూర్ణశ్రీ (59వ వార్డు) ఉన్నారు. పూర్ణశ్రీ వైసీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి ఇటీవలే జనసేనలో చేరినందున ఆమెకు జనసేన నుంచి డిప్యూటీ మేయర్ పదవికి బీఫారం ఇచ్చేందుకు అవకాశం లేదు. ఒకవేళ డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నా సరే ఆమె వైసీపీకి చెందినవారిగానే అధికారికంగా పరిగణిస్తారు. దీంతో టీడీపీకి చెందిన మొల్లి హేమలత, గొలగాని మంగవేణి మధ్యే పోటీ ఉంటుంది. వారిద్దరిలో అయితే విద్యావంతురాలైన మొల్లి హేమలత వైపు నేతలు మొగ్గుచూపే అవకాశం ఉంటుంది. కాగా ప్రస్తుతం అవిశ్వాస తీర్మానంతో డిప్యూటీ మేయర్ పదవిని కోల్పోయిన జియ్యాని శ్రీధర్ కాపు సామాజిక వర్గానికి చెందినవారు. అందువల్ల ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఆ పదవిని ఇవ్వకపోతే వారి నుంచి విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉందని కూటమిలో మరో వర్గం నేతలు ఆలోచిస్తున్నారు. అదే జరిగితే జనసేనలో కాపు సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు లేనందున టీడీపీ కార్పొరేటర్లకే అవకాశం దక్కుతుంది. అలా చూస్తే 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పేర్లు పరిశీలనకు వస్తాయి. వారిలో గంధం శ్రీనివాసరావుకు రెండుసార్లు కౌన్సిలర్‌గా, రెండుసార్లు కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో డిప్యూటీ మేయర్ పదవికి ఇటీవల జరిగిన సమావేశంలో కొందరు ప్రజా ప్రతినిధులు ఆయన పేరును సూచించినట్టు తెలిసింది. మరోవైపు బొండా జగన్నాథం, బల్ల శ్రీనివాసరావు, పిసిని వరహానర్సింహం పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. మరోవైపు మేయర్‌పై అవిశ్వాస తీర్మానంలో బీజేపీ ఓటు కీలకంగా మారినందున నగరంలో పార్టీ బలోపేతం కోసం డిప్యూటీ మేయర్ పదవి తీసుకోవాలంటూ కార్పొరేటర్ గంకల కవిత డిమాండ్ చేస్తున్నారు. ఈ వారంలోనే డిప్యూటీమేయర్ ఎన్నిక నోటిఫికేషన్ వస్తుండడంతో ఏం జరుగుతుందనే దానిపై కూటమి నేతలు, కార్పొరేటర్లు, కార్యకర్తల్లో కూడా ఆసక్తి నెలకొంది.

దంపతుల హత్య కేసులో పోలీసులకు క్లూ?

... 5వ పేజీ తరువాయి

అనుబంధంగా ఉన్న వాష్‌రూమ్‌కు రెండు వైపులా తలుపులు ఉన్నాయి. వాటి ద్వారా ఒక పడక గది నుంచి మరో పడక గదిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఈ విషయాన్ని యోగేంద్రబాబు కుమార్తె శిల్ప పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. నిందితులు ముందు తండ్రిపై దాడి చేసి ఉంటారని, ఆయన తల్లిని హెచ్చరించి మరో పడక గదిలోకి పంపించేసి ఉంటారని, తండ్రిని చంపిన తరువాత వారు వాష్‌రూమ్ ద్వారా తల్లి ఉన్న పడక గదిలోకి వెళ్లి ఆమెపై దాడి చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. అంటే...ఇంట్లో వాష్‌రూమ్‌కు రెండు తలుపులు ఉన్నాయని తెలిసిన వారే ఈ పని చేశారని ఆమె అభిప్రాయపడ్డారు. పోలీసులు ఈ కోణంలోను దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ ఈ కేసులో ఇప్పటివరకూ నాలుగు క్లూలు (ఆధారాలు) లభించాయని, వాటి ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారని, త్వరగానే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. ఇటీవల విశాఖపట్నం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు ఈ కేసు పురోగతి గురించి ఆరా తీయడంతో పోలీసులు వీలైనంత వేగంగా దీనిని ఛేదించాలని ప్రయత్నిస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న స్థలం వద్ద బ్యానర్ ఏర్పాటు చేసిన సిబ్బంది

అన్యాక్రాంతమైన డీ-పట్టా భూములు స్వాధీనం

పద్మనాభం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డివలస గ్రామంలో వాస్తవ లబ్ధిదారుల నుంచి పరాధీనమైన డీ-పట్టా భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 26/2, 26/5లో 4.43 ఎకరాల భూములకు సంబంధించి మద్రగడ అప్పలనారాయణ అనే వ్యక్తికి డి-ఫారం పట్టా ఇచ్చారు. అయితే ఈ భూములు సదరు రైతు స్వాధీనంలో లేకపోగా.. రెడ్డిపల్లి శ్రీనివాసరావు, రెడ్డిపల్లి సత్యనారాయణ, రెడ్డిపల్లి రమేష్‌ల ఆధీనంలో అనధికారికంగా ఉన్నట్టు పలువురు రైతులు అధికారులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు ఇవి డీ-పట్టా పట్టా భూములుగా గుర్తించారు. తహశీల్దార్ కె.ఆనందరావు ఆదేశాల మేరకు ఆర్ఐ శ్యామల, వీఆర్వో స్వామి తదితరులు ఈ భూములను స్వాధీనం చేసుకోవడంతో ఆ స్థలంలో హెచ్చరికతో కూడిన బ్యానర్‌ను ఏర్పాటు చేశారు.

సింహగిరిపైకి 51 ఉచిత బస్సులు

వేపగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చందనోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి సింహగిరిపైకి ప్రయాణికులను ఉచితంగా తరలించేందుకు గాను 51 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసినట్టు సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సింహాచలం వచ్చే వాహనాలన్నీ గోపాలపట్నం పెట్రోల్ బంక్, శ్రీనివాసనగర్ మీదుగా గోశాల వరకు మాత్రమే నడుస్తాయన్నారు. చోడవరం, దేవరాపల్లి, కొత్తవలస, పెందుర్తి నుంచి వచ్చే బస్సులు వేపగుంట మీదుగా గోశాల వరకు నడుస్తుయని పేర్కొన్నారు. సింహాద్రి అప్పన్న స్వామి నిజరూప దర్శనానికి విచ్చేసే భక్తుల వాహనాలను పార్కింగ్ చేసేందుకు గాను పోలీస్, దేవస్థానం, జీవీఎంసీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇందులోభాగంగా కార్లను నిలిపిందుకు గాను గోశాల పరిధిలో ఉన్న ఖాళీ ప్రాంతాలు, బీఆర్‌టి.ఎస్ సెంటర్ రోడ్డుతోపాటు శ్రీనివాసనగర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న మామిడి చెట్లు ఉన్న ప్రాంతాలను చదును చేసి పార్కింగ్‌కు సిద్ధం చేశారు.

పీహెచ్‌డీ ప్రవేశాల్లో జాప్యం

... 5వ పేజీ తరువాయి

నిర్వహించకపోతే మొత్తం ఫండ్ వెనక్కి వెళ్లిపోతుందని పేర్కొంటున్నారు. ఇదిలావుంటే ఇప్పటివరకూ సెప్టెంబరులో నిర్వహించిన యూజీసీ నెట్‌కు సంబంధించిన అడ్మిషన్స్‌నే అధికారులు చేపట్టలేదు. డిసెంబరులో కూడా యూజీసీ నెట్ నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫలితాలు కూడా వెలువడ్డాయి. వాటికి సంబంధించిన అడ్మిషన్లు ఇంకెప్పుడు చేపడతారోనన్న ఆందోళనను అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పీడీఎస్‌వో విద్యార్థి సంఘ నేతలు వీసీని కలిసి తెలియజేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ అడ్మిషన్స్ ప్రక్రియను పూర్తి చేయాలని పీడీఎస్‌వో విద్యార్థి సంఘ నేత భాను కోరారు.

'పది' విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో గంటా రవితేజ

భీమునిపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గంటా నారాయణమ్మ మెమోరియల్ ట్రస్టు తరఫున మంగళవారం నగదు బహుమతులను అందజేశారు. బీచ్ రోడ్డులో గల ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ యువనేత గంటా రవితేజ విచ్చేసి విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన వీరిని ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అలాగే టెన్త్ ఫలితాల్లో సాధించిన మార్కులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులందరూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మండల, జోన్ స్థాయిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విద్యార్థులకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు, విద్యార్థుల తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

మెట్ల మార్గం దెబ్బతింటుండడంతో క్లీనింగ్ నిమిత్తం పైకి వెళ్లేందుకు భీతిల్లుతున్న సిబ్బంది



స్వర్ణభారతి నగర్‌లోని వాటర్ ట్యాంక్

సాగర్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెద్ద రుషికొండ సమీప స్వర్ణభారతి నగర్ రక్షిత తాగునీటి సరఫరా ట్యాంక్ నిర్వహణ లోపం కారణంగా శిథిలావస్థకు చేరుకుంటుంది. 90 కేఎల్ సామర్థ్యంతో కూడిన ఈ వాటర్ ట్యాంక్ పెద్ద రుషికొండ, స్వర్ణభారతి నగర్, ఎస్సీ బీసీ కాలనీలకు చెందిన ప్రజల దాహార్తిని తీరుస్తుంది. ట్యాంక్ నిర్మాణం తర్వాత ఒకసారి కూడా దీనికి కనీసం పెయింటింగ్ కూడా వేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయలతో దీనిని నిర్మించిన సంబంధిత విభాగం అధికారులు నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో శిథిల స్థితికి చేరుకుంటుంది. ట్యాంకు పైకి వెళ్లేందుకు మెట్లలో కొన్ని పాడై పోయి కింద పడిపోయాయి. దీంతో క్లీనింగ్ సమయాల్లో వాటర్ ట్యాంకు పైకి వెళ్లేందుకు సిబ్బంది భీతిల్లుతున్నారు. మెట్లన్నీ శిథిలమై పడిపోకముందే అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే ట్యాంక్ పరిసరాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించాలని వేడుకుంటున్నారు.



బీచ్‌రోడ్డులో నాడు కళకళలాడుతూ ఫౌంటెన్



నిర్వహణకు నోచుకోక నేడు కళా విహీనంగా..

కళా విహీనంగా వాటర్ ఫౌంటెన్

» నిర్వహణకు నోచుకోక శిథిల స్థితికి..

» పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

భీమునిపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీచ్ రోడ్డు పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్ నిర్వహణ లోపంతో కళావిహీనంగా మారిపోయింది. నగరంలో జరిగిన జీ20 సదస్సు సమయంలో దీనికి మరమ్మతులు చేసి, రంగులు అద్ది అందంగా తీర్చిదిద్దారు. అయితే ఏడాదిన్నర గడవక ముందే మళ్లీ కళ తప్పింది. సందర్శకులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే ఈ వాటర్ ఫౌంటెయిన్ చెత్తతో నిండిపోయింది. ఇక్కడ బోరు బావిని తవ్వకపోవడంతో మునిసిపల్ వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని నింపేవారు. దీనిపై ఏఈ సురేశ్ వద్ద ప్రస్తావించగా ఫౌంటెయిన్ అడుగున టైల్స్ నుంచి నీరు లీకవుతోందని, మరమ్మతులకు ప్రతిపాదించామన్నారు.

కాలువ తవ్వి.. డెబ్రిస్‌ను రోడ్డుపై వదిలేశారు

- శివాజీపాలెం పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై వాహనదారుల ఇబ్బందులు
- నెల రోజులైనా సమస్య పరిష్కరించని జీవీఎంసీ అధికారులు
- మరోవైపు జాతీయ రహదారిపై కొత్త లేయర్ పనులు
- వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు



శివాజీపాలెం పెట్రోల్ బంకు వద్ద కాలువను తవ్వి రోడ్డుపై వదిలేసిన డెబ్రిస్

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యం జాతీయ రహదారిపై వాహనచోదకులకు ప్రాణసంకటంగా మారింది. నెల రోజులు కిందట నగరంలో కురిసిన వర్షానికి ఇసుకతోట-శివాజీపాలెం మధ్య జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంకు వద్ద డ్రైనేజీ బ్లాక్ అయింది. అక్కడికి సమీపంలో ఉన్న మిఠాయి దుకాణంలో చెత్తాచెదారాలను నేరుగా కాలువలోకి వదిలేస్తుండడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. అదే సమయంలో నగరంలో భారీ వర్షం కురవడంతో వర్షం నీరు డ్రైనేజీ నుంచి పొంగి పల్లపు ప్రాంతంలో ఉన్న మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇళ్లు ఉన్న ప్రాంతాన్ని ముంచెత్తింది. దీంతో జీవీఎంసీ అధికారులు ఆఘమేఘాల మీద ప్రొక్లెయినర్ తెప్పించి డ్రైన్ బ్లాక్ అయిన ప్రాంతంలో తవ్వి సిమెంట్ పలకలతో పాటు డెబ్రిస్‌ను రోడ్డుపక్కన కుప్పగా వేశారు.

సుమారు నెల రోజులు గడుస్తున్నా సరే రోడ్డు పక్కన వేసిన డెబ్రిస్‌ను తొలగించకపోవడంతో ఇసుకతోట నుంచి శివాజీపాలెం, మద్దిలపాలెం వైపు వచ్చే వాహనాలకు ఇబ్బందిగా మారింది. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా డెబ్రిస్‌ను వదిలేయడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు.

మరోవైపు జాతీయరహదారిపై కొత్త లేయర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డుపై డెబ్రిస్ ఉన్న ప్రాంతంలో ఇప్పటికే రోడ్డు నిర్మాణం పూర్తి కాగా డెబ్రిస్ ఉన్న చోట మాత్రం రోడ్డు నిర్మాణం చేయకుండా వదిలేశారు. తర్వాత ఎప్పుడో డెబ్రిస్‌ను తొలగించిన తర్వాత అక్కడ రోడ్డు నిర్మాణం చేసినా గతంలో వేసిన బీటీమిక్సింగ్‌కు, తాజాగా వేసిన బీటీ మిక్సింగ్‌కు తేడా వచ్చి ఆప్రాంతంలో రోడ్డు సరిగ్గా అతుక్కునే అవకాశం ఉండదని కొందరు కాంట్రాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుని భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడాలని కోరుతున్నారు.


డ్రైనేజీ మరమ్మతుకు చేపట్టిన తవ్వకాలు

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


తాతారావు (ఫైల్)

భీమునిపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు కెరటాల్లో చిక్కుకుని మృతి చెందాడు. ఈ సంఘటన భీమిలిలో జరిగింది. బోయవీధికి చెందిన చింతపల్లి తాతారావు(60) సోమవారం సాయంత్రం సాగరసంగమములో విసిరి వలతో వేటకు వెళ్లాడు. పెద్ద కెరటం ధాటికి గుర్రై కొట్టుకుపోయాడు. రాత్రికి ఇంటికి రాలేకపోవడంతో కంగారుపడిన కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం తీరంలో గాలించగా అన్నవరం సమీపంలో మృతదేహం కనిపించడంలో బోరున విలపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పైడమ్మ, కుమారులు పోలిరాజు, అప్పన్న, నూకరాజు, కుమార్తె నందిని ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



సీతంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలం కావడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన చుక్కల పవన్ (25) ఇసుకతోటలోని ఓ లాడ్జిలో పనిచేసేవాడు. ఓ యువతితో ప్రేమ విఫలమైంది.అలాగే అప్పులపాలయ్యాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా సీఐ రమణ, ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

సినిమా గైడ్

- **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య(గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ),అరుణ(పెదగంట్యాడ), తాతా (తగరపు వలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక) **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 22, పచ్చిమిర్చి 20, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 22, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)46, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

ఉర్సా ఐటీ కంపెనీకి భూ కేటాయింపులు రద్దు చేయాలి



చినగదిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో అత్యంత ఖరీదైన భూములను ఊరూ పేరూ లేని ఉర్సా క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఐటీ కంపెనీల ఏర్పాటు నిమిత్తం రాష్ట్రప్రభుత్వం కేటాయించిన భూముల ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీపీఎం విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. హిల్ నెంబర్ 3లో టీసీఎస్‌కు కేటాయించిన దగ్గరే 3.6 ఎకరాల భూమిని, కాపులుప్పడలో 56 ఎకరాలను అతి తక్కువ ధరకు కేటాయించడం అవివేకమని విమర్శించారు. అది ఒక బోగస్ కంపెనీ అని, తక్షణమే ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములను వెనక్కు తీసుకోవాలని కోరారు. ఉర్సా సాఫ్ట్‌వేర్ కంపెనీకి భూకేటాయింపును నిరసిస్తూ మంగళవారం ఉదయం విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్ అయిన బోగస్ కంపెనీకి విలువైన ప్రభుత్వ భూములను ఉద్యోగాల పేరిట కేటాయించడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతికేకిస్తుందన్నారు. తక్షణమే ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాలకే కేటాయించాలని, లేదంటే సీపీఎం తరఫున ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు డి.అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, జోన్ కమిటీ సభ్యులు పి.శంకరరావు, కె.కుమారి, ఐసీ నాయుడు, పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ, నాగరాజు, ఎం.లక్ష్మి, ఎస్.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన మిజోరం వర్సిటీ విద్యార్థులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఏయూను మిజోరం యూనివర్సిటీకి చెందిన సోషల్ వర్క్ విభాగ విద్యార్థులు సందర్శించారు. మంగళవారం ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఉపకులపతి ప్రత్యేకంగా మాట్లాడారు. సమాజంలో నేరుగా అనుబంధం కలిగి ఉండే విభాగంగా సోషల్ వర్క్‌నిలుస్తుందన్నారు. సమాజంలో విభిన్న వర్గాల ప్రజలు, వారి సమస్యలను పరిశీలించడం, పరిష్కారాల చూపడం, సమాజాభివృద్ధికి తోడ్పడి దిశగా యువత దృష్టి సారించాలని విద్యార్థులకు వీసీ సూచించారు. విద్యార్థుల బృందానికి మిజోరాం యూనివర్సిటీ ప్రొఫెసర్ కొట్టు శేఖర్ సారథ్యం వహించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజరావు పాల్గొన్నారు.

చందనయాత్ర భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- మేయర్ పీలా శ్రీనివాసరావు

సింహాచలం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూపదర్శనం చందనయాత్రలో పాల్గొనే భక్తులకు సకల సౌకర్యాల కల్పనకు జవీఎంసీ కృషి చేస్తోందని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ అధికారులతో కలిసి మంగళవారం సింహగిరిపై క్షేత్ర పరిశీలన చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవంలో భాగంగా భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దేవాలయ పరిధిలోని తొమ్మిది ప్రాంతాల్లో 1,350 మంది పారిశుధ్య కార్మికులతో ఈనెల 29 నుంచి మే 2 వరకు పనులు చేపడతామన్నారు. కార్మికుల పనితీరును జోన్-8 శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సచివాలయ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పనుల నిర్వహణకు వీలుగా అధికారులకు వైర్‌లెస్ సెట్లను అందజేస్తున్నట్టు చెప్పారు. ఎండ వేడిమి దృష్ట్యా 193 పాయింట్లలో 5,600 వాటర్ క్యాన్లు, 56వేల అర లీటర్ వాటర్ బాటిల్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. 21 ప్రాంతాల్లో 401 తాత్కాలిక మరుగుదొడ్లు, ఐదు మొబైల్ టాయిలెట్లు, ఏర్పాటు చేశామన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్ పీవీ నరసింహం, ఈఈ టి శివప్రసాదరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్, జెడ్సీ హైమావతి, తదితరులున్నారు.

అప్పన్నను దర్శించుకున్న మేయర్ పీలా


కప్పస్తంభం వద్ద మేయర్ పీలా శ్రీనివాసరావు

సింహాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామిని జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పీవీ నరసింహం, బల్లా శ్రీనివాసరావులతో కలసి మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు అధికార లాంఛనాలతో ఏఈఓ ఎన్ ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నా తరువాత మేయర్ గోత్రనామాలతో అంతరాయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

అష్టోత్తర శత కలశ స్నపనానికి సన్నాహాలు


రజిత కలశాలను అలంకరిస్తున్న వైదికులు

సింహాచలం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం తరువాత ఈనెల 30 రాత్రి సహస్ర కలశ స్నపన తిరుమంజనానికి ఆలయ వైదికులు సన్నాహాలు చేశారు. ఇందులో భాగంగా ఆలయ భాండాగారం నుంచి అష్టోత్తర శత (108) రజిత కలశాలను తీసి, వాటిని రంగురంగుల సూత్రాలతో (దారాలతో) మంగళవారం శోభాయమానంగా అలంకరించారు. వాటిని ప్రధానాలయంలో భాగమండపం వద్ద బుధవారం ఉంచుతారు. రాత్రి శ్రీవైష్ణవ స్వాముల సహస్ర కలశాభిషేకం అనంతరం ఆలయ అర్చకస్వాములు ఈ రజిత కలశాలలో పంచామృతాలను, పలురకాల పండ్ల రసాలను తీసుకుని అష్టోత్తర శత కలశ స్నపనాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు.

హనీ గ్రూపు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

- 530 యూనిట్ల సేకరణ


రక్తదాన శిబిరంలో పాల్గొన్న హనీ గ్రూపు అధినేత ముక్కా ఓబుల్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : హనీగ్రూపు ఆధ్వర్యంలో లాసన్స్‌బే కాలనీలోని వారి కార్యాలయంలో మంగళవారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆ సంస్థ ఉద్యోగులు, యువకుల రక్తదానంతో 530 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సంస్థ చైర్మన్, వ్యవస్థాపకులు ముక్కా ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నగరంలోని తొమ్మిది బ్లడ్ బ్యాంకుల ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్ట్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ, రోటరీ క్లబ్ విజయనగరం, మదర్ బ్లడ్ సెంటర్, అమ్మ బ్లడ్ సెంటర్, విజయశ్రీ బ్లడ్ సెంటర్, విమ్స్ బ్లడ్ సెంటర్, లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ సిబ్బంది సేవలు అందించారు.

ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి 1:40 ఉండాలి

- పలు ఉపాధ్యాయ సంఘాల వినతి


డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఆరిలోవ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవో నెంబర్ 117ను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అలాగే పాఠశాలలను బలోపేతం చేసే విధంగా తీసుకోవడమే కాకుండా కార్యచరణ అమలు చేయడం బాగుందని, ఇందుకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఎస్టీయూ పీఆర్టీయూ పండిత్ పరిషత్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పుడు జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల్లో మొదటి సెక్షన్‌కు విద్యార్థి ఉపాధ్యాయుని నిష్పత్తి 1:53గా నిర్ణయించడం వలన చాలా వరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు చాలా జిల్లాల్లో మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోందన్నారు. గతంలో కూడా విశాఖ జిల్లా నుంచి కొన్ని పోస్టులను కోల్పోయి ఇతర జిల్లాలకు ఇవ్వడం జరిగిందన్నారు. మళ్లీ అటువంటి పరిస్థితి రాకుండా మొదటి సెక్షన్ నుంచి 1 : 40 నిష్పత్తిలో పోస్టులను కేటాయించడం వలన ప్రతి విద్యార్థికి వ్యక్తిగత పర్యవేక్షణ చేయడమే కాకుండా పూర్తి స్థాయిలో న్యాయం చేయడానికి ఉపాధ్యాయుడికి అవకాశం ఉంటుందన్నారు. దీనిపై జిల్లా విద్యా శాఖాధికారి సూచనను ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయ ఐక్య కూటమి తరఫున ఎస్టీయూ, పండిత్ పరిషత్, పీఆర్టీయూ ప్రధాన ఉపాధ్యాయుల సంఘాలు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌కు మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ అసోసియేషన్ నుంచి ఎస్టీ యూ, ఇమంది పైడిరాజు, బాబు లాల్ పీఆర్టీయూ నుంచి గోపీనాథ్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఎ.జోగారావు, ఎంవీ కృష్ణా కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ప్రశ్నిస్తే అరెస్టు చేయడం అన్యాయం

- బీసీ సంఘం నేతల ఆగ్రహం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నేతలు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : బీసీల కులగణన చేపట్టాలని ర్యాలీగా వెళ్తున్న వారిని పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని విశాఖపట్నం బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీ పదో సెక్టరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశాఖ బీసీ సంఘం నాయకులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందే బీసీలకు రక్షణ చట్టం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిందని, ఓబీసీ కుల జనగణన వెంటనే చేపట్టాలని, 33 శాతం మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళల రిజర్వేషన్ తేల్చాలని నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలో సోమవారం జరిగిన ర్యాలీలో డబ్బై ఏళ్ల వయసున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును అరెస్టు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్ని శ్రీనివాస్, ఉత్తరాంధ్ర కన్వీనర్ గొర్లె శ్రీనివాస నాయుడు, బీసీ ఉద్యోగుల అధ్యక్షులు వైవీ వెంకటేశ్వరరావు, విశాఖ సంఘం గౌరవ అధ్యక్షులు కామన వెంకట సుబ్బారావు, బీసీ, ఎస్టీ మైనారిటీ సంఘం కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, విశాఖ కార్యదర్శి ప్రసాద్, బీసీ నాయకురాలు దీప్తి, డాక్టర్ గాయత్రిదేవి, శ్రీనివాసరావు, బీఎస్‌పీ జిల్లా అధ్యక్షులు విశ్వనాథం, బీసీ సంఘం నాయకులు కె వెంకట ఉమా మహేష్, కొప్పిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో శరవేగంగా అభివృద్ధి

- విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

మహారాణిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఇప్పుడు శరవేగంగా అభివృద్ధి చెందుతోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం విశాఖ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు వెనుకబడి ఉండిపోయిన ఉత్తరాంధ్ర కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతీ క్షణం ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ఆలోచిస్తున్నారని అన్నారు. భోగాపురం విమానాశ్రయం శరవేగంగా పూర్తవుతోందని, ఉత్తరాంధ్ర నుంచి ఇతర రాష్ట్రాలకు జాతీయ రహదారులు అనుసంధానమవుతున్నాయని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ జరిగిన భూ దందాలు అన్నీ ఇన్నీ కావని, రాజగురువు శారదా పీఠానికి అడ్డుగోలుగా భూములు ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం గద్దె దిగటానికి కారణం భూ దందాలు, భూ కబ్జాలు, మాయలేనని ఆక్షేపించారు. గత పది నెలల్లో ఎన్నో ఐటీ కంపెనీలు విశాఖకు తరలివచ్చాయని, పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు తరలి వస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకుంటుందని, అర్ధరాత్రులు జీవోలు విడుదల కావడం లేదని, అర్ధరాత్రులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయటం లేదని, వైసీపీ అవాస్తవ ఆరోపణలు మానుకుని పరిపాలనకు సహకరించాలని కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు.

మేయర్ పీలాకు భీమిలి ఎమ్మెల్యే గంటా అభినందన


మేయర్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా

సిరిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు మంగళవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో అధునాతన మౌలిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని గంటా సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారి మన్ననలు పొందాలన్నారు. శాలువా కప్పి పీలాను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పీవీ నరసింహం, బల్ల శ్రీను, టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదు

- వాల్తేరు ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూ ఆధ్వర్యంలో కార్మికుల రిలే నిరాహార దీక్షలు


వాల్తేరు డిపో వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు, ఆర్టీసీ కార్మికులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాతారావు మంగళవారం వాల్తేరు డిపో వద్ద రెండు రోజుల రిలే నిరాహార దీక్షా శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యచరణను ఉద్దేశించి డిపో కార్యదర్శి ఆర్‌వసంతరావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేసే వరకు ఈ ఉద్యమం ఆగదని, నైట్ అలవెన్స్‌లను రూ.150 నుండి రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. త్వరలో వచ్చే ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ లేదా గవర్నమెంట్ ద్వారా మాత్రమే నడపాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని ఉద్యోగులకు కొనసాగించాలన్నారు. డబుల్ డ్యూటీకి ఇచ్చే వేతనాన్ని పెంచాలని, అక్రమ సస్పెన్స్ అక్రమ రిమూవల్స్ ఆపాలని, అన్ కాల్డ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.గ్యారేజ్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాని, రాష్ట్ర కమిటీ ఇచ్చిన వినతిపత్రంలోని సమస్యలన్నీ పరిష్కరించే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వీయుఎం నూర్జహాన్, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ ఆర్‌ఈ రావు, సీసీఎస్ డెలిగేట్లు, కేటీరావు, పి.జగదీష్ అత్యధిక సంఖ్యలో వాల్తేరు డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా చినవాల్తేరు కనకమహాలక్ష్మి పండుగ


భక్తులకు శీతల పానీయాలను పంపిణి చేసిన మొహమ్మదీయ మసీద్ యూత్ సభ్యులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : చినవాల్తేరులోని శ్రీకనకమహాలక్ష్మి (దుర్గ) అమ్మవారి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచేఆలయ నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చినవాల్తేరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులకు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మహిళా భక్తులు బిందెలతో నీటిని మండుటెండలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి జాలాభిషేకాలు చేశారు. ఎండలో వచ్చిన భక్తులు ఉపశమనం పొందేలా చినవాలేర్‌కు చెందిన మొహమ్మదీయ మసీద్ యూత్ సభ్యులు కూల్‌డ్రింక్‌లను పంపిణీ చేశారు. కులమతాలకు అతీతంగా అమ్మవారి పండుగ సమయంలో భక్తులకు ముస్లిం సోదరులు శీతల పానీయాలను పంపిణీచేయడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు భక్తులు పేర్కొన్నారు.

మేయర్‌కు సచివాలయ ఉద్యోగుల అభినందన



మేయర్ పీలా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

మహారాణిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు నూతన మేయర్ పీలా శ్రీనివాసరావును మంగళవారం సన్మానించారు. వార్డు పరిపాలన కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు పి.వి.కిరణ్‌కుమార్, ఇతర సభ్యులు పీలా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందించి శుభాభినందనలు తెలిపారు. సంఘం విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు, చింతకాయల బంగార్రాజు, బి.వి.అశోక్ కుమార్, ఇ.పవన్‌కుమార్, సాయికృష్ణ, నానాజీ తదితరులు మేయర్‌ను కలిసినవారిలో ఉన్నారు.

5న దాసరి జయంతి వేడుకలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హెల్ప్ టు హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ తెలుగు చలనచిత్ర దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వీఎఫ్ఎస్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. మే 5న సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో ప్రత్యేక సమావేశం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మీగడ శివశ్రీ దర్శకత్వంలో రూపుదిద్దుకొని నాగభట్ల రఘురాం నిర్మాతగా అవార్డులు పొందిన లఘుచిత్రాలు ప్రదర్శిస్తామన్నారు.

భారీగా ఆస్తి పన్ను వసూలు

జ్ఞానాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 పరిధిలోని 45వ వార్డులో ఉన్న హెచ్‌పీసీఎల్ కంపెనీ నుంచి జోన్-5 రెవెన్యూ అధికారులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.14 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేశారు. ఇందుకు సంబంధించిన ఆర్‌టీజీఎస్ కాపీని రెవెన్యూ ఆర్ఓ రాజ్యలక్ష్మి, బాబురావు, ఆర్ఐ శ్రీనివాసులు జోనల్ కమిషనర్ బి.రాముకు అందజేశారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి నగదు అందిస్తున్న శ్యాంసుందర్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సంగం ఆఫీసు జంక్షన్‌లోని స్వరాలయ స్టూడియోలో మంగళవారం సాయంత్రం సినీ సంగీత విభావరి ఏర్పాటు చేసి తద్వారా వచ్చిన రూ.33 వేల నగదును కిడ్నీ బాధితుడు అల్లిపిల్లి లక్ష్మణరావు కుటుంబానికి స్టూడియో అధినేత శ్యాంసుందర్ అందజేశారు. విజయనగరం జిల్లా గులువిందపేటకు చెందిన లక్ష్మణరావు ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చి ఎండాడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేసేవాడు. ఎప్పటికప్పుడు అనారోగ్య సమస్యలు రావడంతో వైద్యులను సంప్రదించగా కిడ్నీ మార్పిడి చేయాలని చెప్పారు. శస్త్రచికిత్సకు రూ.9.90 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో లక్ష్మణరావు దాతల కోసం ఎదురు చూశాడు. స్వరాలయ స్టూడియో అధినేత శ్యాంసుందర్‌కు విషయం తెలిసి సినీ సంగీత విభావరి ఏర్పాటు చేసి వచ్చిన సొమ్మును బాధిత కుటుంబానికి అందజేశారు.. దాతలు స్పందించి ఆదుకోవాలని, ఆర్థిక సాయం చేయదలచినవారు 8688052887 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని లక్ష్మణరావు కుటుంబ సభ్యులు అభ్యర్థిస్తున్నారు.

ఉత్తరాంధ్రలో సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి జరగాలి

» కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య సూచన



మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణయ్య

మహారాణిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో సుస్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి జరగాలని, ఇందుకు అన్నివిధాలా సహకరిస్తామని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ సి.కృష్ణయ్య అన్నారు మంగళవారం హోటల్ గ్రీన్ పార్కులో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఫార్మా కెమికల్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ పరిశ్రమ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఉత్పత్తిని సాధించాలని, పరిశ్రమలలో వ్యర్థాలను సాధ్యమైనంతవరకు తగ్గించాలని, అవసరమైతే గ్రీన్ టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. సంస్థ సీఈ ప్రసాద్ మాట్లాడుతూ మెరైన్ స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్ ప్రకారం ఫార్మా కంపెనీలు తమ వ్యర్థాలను విడుదల చేయాలని సూచించారు ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు

భారత రాజ్యాంగం అందరికీ మార్గదర్శకం



పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన పోర్టు అథారిటీ చైర్‌పర్సన్ ఎం.అంగముత్తు, చిత్రంలో పోర్టు అధికారులు

మహారాణిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ నేతృత్వంలో రూపొందించిన భారత రాజ్యాంగం ప్రతీ పౌరునికి మార్గదర్శకమని, ఆయన సేవలు చరిత్రాత్మకంగా నిలుస్తాయని పోర్టు అథారిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం పోర్టు పరిపాలనా భవనం సాంబమూర్తి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి చైర్‌పర్సన్ అంగముత్తు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సమావేశంలో డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే, పీఎస్ఎల్ స్వామి, ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం అధ్యక్షుడు జి.ఉమామహేశ్వరరావు, ఎం.దేవీశ్వరరావు, రామలింగం, జి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

సమయానికి తెరుచుకోని వార్డు సచివాలయాలు



తెరుచుకోని సచివాలయం తలుపులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డులోని సచివాలయాలు ఎప్పుడు తెరుస్తారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ వార్డులోని శ్రీనివాసనగర్ ప్రజారోగ్య కేంద్రం మేడపై 242, 243 సచివాలయాలు ఉన్నాయి. ఇవి ఎప్పుడు తెరుచుకుంటాయో స్థానికులకు తెలియని పరిస్థితి. సచివాలయాలు ప్రతి రోజు ఉదయం 10 గంటలకు తెరుచుకోవాల్సి ఉండగా సమయం గడిచినా బాధ్యులు కానరారని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం 10-15 గంటలు దాటినా రెండు సచివాలయాలు తెరుచుకోలేదు. దీంతో వివిధ పనులపై వచ్చిన స్థానికులు ఇబ్బంది పడ్డారు. రోజూ ఇదే పరిస్థితి ఉందంటున్నారు. ఒక వేళ సమయానికి తెరుచుకున్నా సిబ్బంది పూర్తి స్థాయిలో రావడం లేదని చెబుతున్నారు. సచివాలయానికి వెళ్తే అక్కడ సిబ్బంది లేకపోవడంతో సంబంధిత సిబ్బంది లేరా? అని మిగతా సిబ్బందిని అడిగితే ఫీల్డ్‌లోకి లేదా జోనల్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారని చెబుతుంటారు. వివిధ రకాల సేవలను స్థానికులకు అందుబాటులో ఉంచేందుకు గత ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసింది. కొద్ది రోజులు సిబ్బంది సక్రమంగా విధులకు హాజరయ్యారని, రోజులు గడిచినకొద్దీ సమయపాలన పాటించడం లేదని పేర్కొంటున్నారు. తాము సచివాలయాలకు వెళ్లి గంటల కొద్దీ నిరీక్షించడమే తప్ప వారి దర్శనం కలగడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల్లో సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహా పాదయాత్ర పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉషా చీరాల, ఇతర ప్రముఖులు

సీతంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రచయిత అడపా రామకృష్ణ రచించిన 'మహా పాదయాత్ర' పుస్తకాన్ని మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రచయిత, నటులు మేడా మస్తాన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏయూ ఇంజనీరింగ్ విభాగం అంతర్జాతీయ, జాతీయ జర్నల్స్ అడ్జాక్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషా చీరాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రం రెండుగా విడిపోయి ఎన్నో ఆటంకాలు ఎదురై, మహిళలంతా ఉద్యమించాక ఇప్పుడు అమరావతిని రాజధానిగా చెప్పుకొంటున్నామన్నారు. అడపా రామకృష్ణ మహిళల ధైర్య సాహస కృత్యాలే దృశ్యమానంగా మలిచారన్నారు. పుస్తకాన్ని డాక్టర్ కెవిఎస్ మూర్తి సమీక్షించారు. పుస్తక రచయిత అడపా రామకృష్ణ తన అనుభవాన్ని పంచుకున్నారు. శిరేల సన్యాసిరావు, సీహెచ్ చిన సూర్యనారాయణ, సుసర్ల సర్వేశ్వర శాస్త్రి, ఎం.పరమేశ్వరరావు, సాహితీ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న వారితో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని బీజేపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో పలువురికి మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సహాయార్థులకు సుమారు రూ.9 లక్షల చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, బీజేపీ ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ సురేష్ బాబు, కార్పొరేటర్ హనూక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి పట్టివేత



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

సీతంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి సంచులతో ఉన్న ఇద్దరిని సీతమ్మధార ప్రొహిబిషన్ అధికారులు పట్టుకున్నారు. జ్ఞానాపురం రైల్వేస్టేషన్ అవుట్‌గేట్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు ఉన్నారని ఇన్‌స్పెక్టర్ బి.నాగవేణికి సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. వారిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా 10 కేజీల గంజాయి లభ్యమైంది. ఇద్దరినీ జిల్లా ఎక్సైజ్ మేజిస్ట్రేట్ ద్వారా రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ నాగవేణి తెలిపారు. నిందితుల వివరాలు వెల్లడించలేదు.

క్వార్టర్లను చుట్టుముట్టిన పిచ్చిమొక్కలు



క్వార్టర్ల వెనుక దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

మర్రిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో స్థానిక రైల్వే ఎయిడెడ్ హైస్కూల్ సమీపంలోని క్వార్టర్ పరిసరాలు అధ్వానంగా మారాయి. అక్కడ నివాసముంటున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. క్వార్టర్స్ ముందు, వెనుక భాగాల్లో దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగిపోయి ఇళ్లలోకి విషపురుగులు, పాములు వచ్చేస్తుండటంతో భయాందోళన చెందుతున్నారు. చెట్ల కొమ్మలు పెరిగి క్వార్టర్ల కిటికీలకు తాకుతుండటంతో, వాటి గుండా విషపురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని వాపోతున్నారు. రాత్రి సమయాల్లో ఎటువైపు నుంచి విషపురుగులు, పాములు వస్తాయోనని మరింత ఆందోళన చెందుతున్నామని పేర్కొన్నారు. క్వార్టర్ల సమీపం లోని విద్యుత్ స్తంభానికి దట్టంగా అల్లుకున్న పాదులు ఇళ్ల కిటికీలకు తాకుతున్నాయి. దురదృష్టవశాత్తు విద్యుత్ ప్రసరించి ప్రమాదం సంభవిస్తుందేమోనని ఆందోళన వెలిబుచ్చారు. సంబంధిత అధికారులు స్పందించి రైల్వే క్వార్టర్ల పరిసరాల్లో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు తొలగించి విషపురుగుల ప్రమాదం నుంచి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

'ప్రభుత్వాన్ని చేతిలో పెట్టుకొని పెట్టుబడిదారుల దందా'



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ వీసీ ప్రొఫెసర్ కె.ఎస్.చలం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని చేతిలో పెట్టుకొని గుత్త పెట్టుబడిదారులు మన ఆస్తులను, భూములను కొట్టేస్తున్నారని ద్రవిడియన్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కె.ఎస్.చలం విమర్శించారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వార్వా, నివాస్ సంయుక్త ఆధ్వర్యంలో 'విశాఖలో ప్రభుత్వ భూములు, ఆస్తుల బదలాయింపు'పై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విస్తారంగా ఉన్న రక్షిత అడవులను, తీర ప్రాంతాన్ని చేజిక్కించుకుంటున్నారన్నారు. చివరికి మన తీర ప్రాంతం ఆదాని కోస్ట్‌గా మారిపోయిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి అంటే ప్రజలదని, అటువంటిది ప్రజాప్రయోజనం కోసం వినియోగించాలన్నారు. పర్యావరణ కార్యకర్త సోహన్ హటంగడి మాట్లాడుతూ నగరానికి ప్రాణవాయువు సరఫరా చేసే ప్రాంతాన్ని ఎకరా 99 పైసల చొప్పున 22 ఎకరాలు టాటా కంపెనీకి ఇచ్చేయడానికి అదియేమైనా పేద సంస్థా? అని ప్రశ్నించారు. నగరంలో పచ్చని ప్రదేశాలను కాంక్రీట్ అడవులుగా మార్చేస్తున్నారన్నారు. ఇటువంటి వాటిని మనమంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వార్వా అధ్యక్షుడు ఎన్.ప్రకాశరావు అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి బీబీ గణేష్, పిట్టా నారాయణమూర్తి, బి.గురప్పనివాస్, హరిప్రసాద్, బి.ఎల్.నారాయణ పాల్గొన్నారు.

మేలో ఏపీ ఎక్స్‌ప్రెస్, స్వర్ణ జయంతి రైళ్లు రద్దు

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని మహబూబాబాద్ స్టేషన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్నందున మే 23 నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805/ 20806) మే 27, 28, జూన్ 18, 19న రెండు వైపులా రద్దు చేశారు. అలాగే విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12803) మే 23, 26, జూన్ 16న, తిరుగు ప్రయాణంలో ఇదే ఎక్స్‌ప్రెస్ (12804) మే 25, 28, జూన్ 18న రద్దు చేశారు.

దారి మళ్లింపు

మే 22, 28న విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (18519/18520); మే 27, 28న షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045); మే 28, 29న హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046) రైళ్లు విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా నడుస్తాయి. మే 27, 28న ముంబయి-భువనేశ్వర్-ముంబయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (11019/11020) పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు, విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. మే 22, 29న విశాఖ-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (20803), మే 25, జూన్ 22న గాంధీధాం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20804) రైళ్లు లాక్‌హోలి, రాయపూర్, నాగపూర్, బాద్నెరా మీదుగా నడుస్తాయి. షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (22849) మే 28న విశాఖ, విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా నడుస్తుంది.

రీ షెడ్యూల్

మే 24, 28న విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-మహబూబ్‌నగర్ (12861) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మహబూబాబాద్‌లో హాల్ట్ ఉండదు. మే 24, 25, 26న భువనేశ్వర్-ముంబయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు (11020)....మే 25, 26న షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (18045) మహబూబాబాద్ స్టేషన్‌లో హాల్ట్ ఉండదు. మే 29న విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఒక గంట 15 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరనుంది.

బెంగళూరు రైళ్లకు డిమాండ్

విశాఖ-బెంగళూరు, విశాఖ-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లకు డిమాండ్ నెలకొంది. విశాఖ-బెంగళూరు ప్రత్యేక రైలుకు (08581) తీవ్ర డిమాండ్ కనిపిస్తోంది. బెంగళూరుకు విశాఖ నుంచి స్థిరమైన (ఒరిజినేటింగ్) రైలు లేకపోవడంతో ప్రత్యేక రైలుకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, హౌరా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ వంటి రోజూ నడిచే రైళ్లు మినహా మిగిలినవి వారాంతపు సర్వీసులు కావడం కూడా ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో ప్రతి బుధవారం మధ్యాహ్నం 3.20 గంటలకు విశాఖ నుంచి బెంగళూరుకు బయలుదేరే 08581 నంబరు గల రైలుకు మే 25 వరకు అన్ని తరగతులలో బెర్తులు నిండిపోయాయి. విశాఖ-బెంగళూరు ప్రత్యేక రైలు సర్వీసులను కొద్దికాలం పొడిగించడమే కాకుండా వారానికి రెండు రోజులు అందుబాటులో ఉండేలా ఫ్రీక్వెన్సీ పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

పెరుగుతున్న ఆశావహులు

... 5వ పేజీ తరువాయి

చెందిన మహిళను తాము మేయర్‌ను చేస్తే ఇస్తే ఆమెను తొలగించి వేరొక సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్‌కు ఆ పదవిని ఇచ్చారంటూ వైసీపీ నేతలు విమర్శలు ప్రారంభించారు. ఆ విమర్శలను తిప్పికొట్టాలంటే డిప్యూటీ మేయర్ పదవిని యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళకు ఇవ్వాలని కూటమి ప్రజా ప్రతినిధులు భావిస్తున్నారు. ఆ సామాజిక వర్గానికి చెందిన మహిళా కార్పొరేటర్లు టీడీపీలో మొల్లి హేమలత (5వ వార్డు), గొలగాని మంగవేణి (18 వార్డు), జనసేనలో పుర్రె పూర్ణశ్రీ (59వ వార్డు) ఉన్నారు. పూర్ణశ్రీ వైసీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి ఇటీవలే జనసేనలో చేరినందున ఆమెకు జనసేన నుంచి డిప్యూటీ మేయర్ పదవికి బీఫారం ఇచ్చేందుకు అవకాశం లేదు. ఒకవేళ డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నా సరే ఆమె వైసీపీకి చెందినవారిగానే అధికారికంగా పరిగణిస్తారు. దీంతో టీడీపీకి చెందిన మొల్లి హేమలత, గొలగాని మంగవేణి మధ్యే పోటీ ఉంటుంది. వారిద్దరిలో అయితే విద్యావంతురాలైన మొల్లి హేమలత వైపు నేతలు మొగ్గుచూపే అవకాశం ఉంటుంది. కాగా ప్రస్తుతం అవిశ్వాస తీర్మానంతో డిప్యూటీ మేయర్ పదవిని కోల్పోయిన జియ్యాని శ్రీధర్ కాపు సామాజిక వర్గానికి చెందినవారు. అందువల్ల ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఆ పదవిని ఇవ్వకపోతే వారి నుంచి విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉందని కూటమిలో మరో వర్గం నేతలు ఆలోచిస్తున్నారు. అదే జరిగితే జనసేనలో కాపు సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు లేనందున టీడీపీ కార్పొరేటర్లకే అవకాశం దక్కుతుంది. అలా చూస్తే 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పేర్లు పరిశీలనకు వస్తాయి. వారిలో ప్రస్తుతం డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న గంధం శ్రీనివాసరావుకు రెండుసార్లు కౌన్సిలర్‌గా, రెండుసార్లు కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో డిప్యూటీ మేయర్ పదవికి ఇటీవల జరిగిన సమావేశంలో కొందరు ప్రజా ప్రతినిధులు ఆయన పేరును సూచించినట్టు తెలిసింది. మరోవైపు బొండా జగన్నాథం, బల్ల శ్రీనివాసరావు, పిసిని వరహానర్సింహం పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. మరోవైపు మేయర్‌పై అవిశ్వాస తీర్మానంలో బీజేపీ ఓటు కీలకంగా మారినందున నగరంలో పార్టీ బలోపేతం కోసం డిప్యూటీ మేయర్ పదవి తీసుకోవాలంటూ కార్పొరేటర్ గంకల కవిత డిమాండ్ చేస్తున్నారు. ఈ వారంలోనే డిప్యూటీమేయర్ ఎన్నిక నోటిఫికేషన్ వస్తుండడంతో ఏం జరుగుతుందనే దానిపై కూటమి నేతలు, కార్పొరేటర్లు, కార్యకర్తల్లో కూడా ఆసక్తి నెలకొందనే చెప్పుకోవాలి.

సింహగిరికి ఉత్సవ శోభ

... 5వ పేజీ తరువాయి

మంగళవారం సాయంత్రానికి సింహగిరికి చేరుకున్నారు. దేవస్థానం ఏర్పాటుచేసిన ఉచిత దర్శనం క్యూలో వేచిఉన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం అధికారులు రంగురంగుల విద్యుత్ దీపాలతో సింహగిరిని శోభాయమానంగా అలంకరించారు. అదేవిధంగా క్యూలను గతంకంటే ఎక్కువగా నిర్మించారు. ఎక్కడికక్కడ తాగునీటి సదుపాయం కల్పించారు. అనేకచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. దివ్యాంగులను సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ దర్శనానికి అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం సింహగిరిపై పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్యూలు, బారికేడ్లు, మజ్జిగ, తాగునీటి పంపిణీ వంటి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సూచిక బోర్డులను ఎక్కువసంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కొండ దిగువన కొత్తఘాట్‌రోడ్డు, న్యూ గోశాల, పాత గోశాల రోడ్లలో ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, దేవదాయ శాఖ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. పార్కింగ్ ప్రాంతాలను, సైన్‌బోర్డులను చూడడంతో పాటు పోలీసు కంట్రోల్ రూమ్ వ్యవస్థపై కూడా పలు సూచనలిచ్చారు.

చందనోత్సవ టిక్కెట్లకు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

టిక్కెట్లు మరో 150 చొప్పున ఇచ్చారు. అంతరాలయ దర్శన టిక్కెట్లు ఇంకా కావాలని కొందరు పట్టుబట్టగా ఇవ్వలేమని అధికారులు స్పష్టంచేశారు. అధికారుల అంచనా ప్రకారం ప్రొటోకాల్ ద్వారా సుమారుగా మూడు వేల మందికి అంతరాలయ దర్శనం జరిగే అవకాశం ఉంది. ఉదయం ఆరు తరువాత అంతరాలయ దర్శనం ఉండదని ప్రకటించినా నాలుగు గంటలకు ప్రారంభించి ఆరు గంటలలోపు దర్శనాలు ముగించడం సాధ్యం కాదు. కాబట్టి ఉదయం పది గంటల వరకూ వీఐపీలు, అంతరాలయ దర్శనాలు ఉండవచ్చునంటున్నారు.

ప్రణాళిక విజయవంతమైతే మేలు చేసినట్టే

గత ఏడాది ఎన్నికల కోడ్ వల్ల అధికారులకు ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం తప్పింది. దాంతో ఊపిరి పీల్చుకొని సామాన్య భక్తులకు రెండు గంటల్లో దర్శనం చేయించగలిగారు. ఈసారి వ్యూహాత్మకంగా వ్యవహరించినందున సామాన్య భక్తులకు సులువుగా దర్శనం జరగాల్సి ఉంది. ఈ ప్రణాళిక విజయవంతమైతే అధికారులు భక్తులకు మేలు చేసినట్టే.

పీహెచ్‌డీ ప్రవేశాల్లో జాప్యం

... 5వ పేజీ తరువాయి

నిర్వహించకపోతే మొత్తం ఫండ్ వెనక్కి వెళ్లిపోతుందని పేర్కొంటున్నారు. ఇదిలావుంటే ఇప్పటివరకూ సెప్టెంబరులో నిర్వహించిన యూజీసీ నెట్‌కు సంబంధించిన అడ్మిషన్స్‌నే అధికారులు చేపట్టలేదు. డిసెంబరులో కూడా యూజీసీ నెట్ నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫలితాలు కూడా వెలువడ్డాయి. వాటికి సంబంధించిన అడ్మిషన్లు ఇంకెప్పుడు చేపడతారోనన్న ఆందోళనను అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పీడీఎస్‌వో విద్యార్థి సంఘ నేతలు వీసీని కలిసి తెలియజేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ అడ్మిషన్స్ ప్రక్రియను పూర్తి చేయాలని పీడీఎస్‌వో విద్యార్థి సంఘ నేత భాను కోరారు.

దంపతుల హత్య కేసులో పోలీసులకు క్లూ?

... 5వ పేజీ తరువాయి

అనుబంధంగా ఉన్న వాష్‌రూమ్‌కు రెండు వైపులా తలుపులు ఉన్నాయి. వాటి ద్వారా ఒక పడక గది నుంచి మరో పడక గదిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఈ విషయాన్ని యోగేంద్రబాబు కుమార్తె శిల్ప పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. నిందితులు ముందు తండ్రిపై దాడి చేసి ఉంటారని, ఆయన తల్లిని హెచ్చరించి మరో పడక గదిలోకి పంపించేసి ఉంటారని, తండ్రిని చంపిన తరువాత వారు వాష్‌రూమ్ ద్వారా తల్లి ఉన్న పడక గదిలోకి వెళ్లి ఆమెపై దాడి చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. అంటే...ఇంట్లో వాష్‌రూమ్‌కు రెండు తలుపులు ఉన్నాయని తెలిసిన వారే ఈ పని చేశారని ఆమె అభిప్రాయపడ్డారు. పోలీసులు ఈ కోణంలోను దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ ఈ కేసులో ఇప్పటివరకూ నాలుగు క్లూలు (ఆధారాలు) లభించాయని, వాటి ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారని, త్వరగానే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. ఇటీవల విశాఖపట్నం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు ఈ కేసు పురోగతి గురించి ఆరా తీయడంతో పోలీసులు వీలైనంత వేగంగా దీనిని ఛేదించాలని ప్రయత్నిస్తున్నారు.

కాలువ తవ్వి.. డెబ్రిస్‌ను రోడ్డుపై వదిలేశారు

- శివాజీపాలెం పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై వాహనదారుల ఇబ్బందులు
- నెల రోజులైనా సమస్య పరిష్కరించని జీవీఎంసీ అధికారులు
- మరోవైపు జాతీయ రహదారిపై కొత్త లేయర్ పనులు
- వాహనచోదకులకు తప్పని ఇక్కట్లు



శివాజీపాలెం పెట్రోల్ బంకు వద్ద కాలువను తవ్వి రోడ్డుపై వదిలేసిన డెబ్రిస్

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యం జాతీయ రహదారిపై వాహనచోదకులకు ప్రాణసంకటంగా మారింది. నెల రోజులు కిందట నగరంలో కురిసిన వర్షానికి ఇసుకతోట-శివాజీపాలెం మధ్య జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంకు వద్ద డ్రైనేజీ బ్లాక్ అయింది. అక్కడికి సమీపంలో ఉన్న మిఠాయి దుకాణంలో చెత్తాచెదారాలను నేరుగా కాలువలోకి వదిలేస్తుండడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. అదే సమయంలో నగరంలో భారీ వర్షం కురవడంతో వర్షం నీరు డ్రైనేజీ నుంచి పొంగి పల్లపు ప్రాంతంలో ఉన్న మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇళ్లు ఉన్న ప్రాంతాన్ని ముంచెత్తింది. దీంతో జీవీఎంసీ అధికారులు ఆఘమేఘాల మీద ప్రొక్లెయినర్ తెప్పించి డ్రైన్ బ్లాక్ అయిన ప్రాంతంలో తవ్వి సిమెంట్ పలకలతో పాటు డెబ్రిస్‌ను రోడ్డుపక్కన కుప్పగా వేశారు.

సుమారు నెల రోజులు గడుస్తున్నా సరే రోడ్డు పక్కన వేసిన డెబ్రిస్‌ను తొలగించకపోవడంతో ఇసుకతోట నుంచి శివాజీపాలెం, మద్దిలపాలెం వైపు వచ్చే వాహనాలకు ఇబ్బందిగా మారింది. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా డెబ్రిస్‌ను వదిలేయడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు.

మరోవైపు జాతీయరహదారిపై కొత్త లేయర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డుపై డెబ్రిస్ ఉన్న ప్రాంతంలో ఇప్పటికే రోడ్డు నిర్మాణం పూర్తి కాగా డెబ్రిస్ ఉన్న చోట మాత్రం రోడ్డు నిర్మాణం చేయకుండా వదిలేశారు. తర్వాత ఎప్పుడో డెబ్రిస్‌ను తొలగించిన తర్వాత అక్కడ రోడ్డు నిర్మాణం చేసినా గతంలో వేసిన బీటీమిక్సింగ్‌కు, తాజాగా వేసిన బీటీ మిక్సింగ్‌కు తేడా వచ్చి ఆప్రాంతంలో రోడ్డు సరిగ్గా అతుక్కునే అవకాశం ఉండదని కొందరు కాంట్రాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుని భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడాలని కోరుతున్నారు.


డ్రైనేజీ మరమ్మతుకు చేపట్టిన తవ్వకాలు

ఉత్తరాంధ్రలో శరవేగంగా అభివృద్ధి

- విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

మహారాణిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఇప్పుడు శరవేగంగా అభివృద్ధి చెందుతోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం విశాఖ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు వెనుకబడి ఉండిపోయిన ఉత్తరాంధ్ర కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతీ క్షణం ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ఆలోచిస్తున్నారని అన్నారు. భోగాపురం విమానాశ్రయం శరవేగంగా పూర్తవుతోందని, ఉత్తరాంధ్ర నుంచి ఇతర రాష్ట్రాలకు జాతీయ రహదారులు అనుసంధానమవుతున్నాయని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ జరిగిన భూ దందాలు అన్నీ ఇన్నీ కావని, రాజగురువు శారదా పీఠానికి అడ్డుగోలుగా భూములు ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం గద్దె దిగటానికి కారణం భూ దందాలు, భూ కబ్జాలు, మాయలేనని ఆక్షేపించారు. గత పది నెలల్లో ఎన్నో ఐటీ కంపెనీలు విశాఖకు తరలివచ్చాయని, పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు తరలి వస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకుంటుందని, అర్ధరాత్రులు జీవోలు విడుదల కావడం లేదని, అర్ధరాత్రులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయటం లేదని, వైసీపీ అవాస్తవ ఆరోపణలు మానుకుని పరిపాలనకు సహకరించాలని కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు.

మేయర్ పీలాకు భీమిలి ఎమ్మెల్యే గంటా అభినందన


మేయర్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా

సిరిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు మంగళవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో అధునాతన మౌలిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని గంటా సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారి మన్ననలు పొందాలన్నారు. శాలువా కప్పి పీలాను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పీవీ నరసింహం, బల్ల శ్రీను, టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదు

- వాల్తేరు ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూ ఆధ్వర్యంలో కార్మికుల రిలే నిరాహార దీక్షలు


వాల్తేరు డిపో వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు, ఆర్టీసీ కార్మికులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాతారావు మంగళవారం వాల్తేరు డిపో వద్ద రెండు రోజుల రిలే నిరాహార దీక్షా శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణను ఉద్దేశించి డిపో కార్యదర్శి ఆర్‌వసంతరావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేసే వరకు ఈ ఉద్యమం ఆగదని, నైట్ అలవెన్స్‌లను రూ.150 నుండి రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. త్వరలో వచ్చే ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ లేదా గవర్నమెంట్ ద్వారా మాత్రమే నడపాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని ఉద్యోగులకు కొనసాగించాలన్నారు. డబుల్ డ్యూటీకి ఇచ్చే వేతనాన్ని పెంచాలని, అక్రమ సస్పెన్స్ అక్రమ రిమూవల్స్ ఆపాలని, అన్ కాల్డ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.గ్యారేజ్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాని, రాష్ట్ర కమిటీ ఇచ్చిన వినతిపత్రంలోని సమస్యలన్నీ పరిష్కరించే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వీయుఎం నూర్జహాన్, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ ఆర్‌ఈ రావు, సీసీఎస్ డెలిగేట్లు, కేటీరావు, పి.జగదీష్ అత్యధిక సంఖ్యలో వాల్తేరు డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా చినవాల్తేరు కనకమహాలక్ష్మి పండుగ


భక్తులకు శీతల పానీయాలను పంపిణీ చేసిన మొహమ్మదీయ మసీద్ యూత్ సభ్యులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : చినవాల్తేరులోని శ్రీకనకమహాలక్ష్మి (దుర్గ) అమ్మవారి పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయ నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చినవాల్తేరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులకు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మహిళా భక్తులు బిందెలతో నీటిని మండుటెండలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకాలు చేశారు. ఎండలో వచ్చిన భక్తులు ఉపశమనం పొందేలా చినవాలేర్‌కు చెందిన మొహమ్మదీయ మసీద్ యూత్ సభ్యులు కూల్‌డ్రింక్‌లను పంపిణీ చేశారు. కులమతాలకు అతీతంగా అమ్మవారి పండుగ సమయంలో భక్తులకు ముస్లిం సోదరులు శీతల పానీయాలను పంపిణీచేయడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు భక్తులు పేర్కొన్నారు.

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


తాతారావు (ఫైల్)

భీమునిపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు కెరటాల్లో చిక్కుకుని మృతి చెందాడు. ఈ సంఘటన భీమిలిలో జరిగింది. బోయవీధికి చెందిన చింతపల్లి తాతారావు(60) సోమవారం సాయంత్రం సాగరసంగమములో విసిరి వలతో వేటకు వెళ్లాడు. పెద్ద కెరటం ధాటికి గుర్రై కొట్టుకుపోయాడు. రాత్రికి ఇంటికి రాలేకపోవడంతో కంగారుపడిన కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం తీరంలో గాలించగా అన్నవరం సమీపంలో మృతదేహం కనిపించడంలో భోరున విలపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పైడమ్మ, కుమారులు పోలిరాజు, అప్పన్న, నూకరాజు, కుమార్తె నందిని ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



సీతంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలం కావడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన చుక్కల పవన్ (25) ఇసుకతోటలోని ఓ లాడ్జిలో పనిచేసేవాడు. ఓ యువతితో ప్రేమ విఫలమైంది.అలాగే అప్పులపాలయ్యాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా సీఐ రమణ, ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

సినిమా గైడ్

- **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య(గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ),అరుణ(పెదగంట్యాడ), తాతా (తగరపు వలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక) **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 22, పచ్చిమిర్చి 20, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 22, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)46, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

ఉర్సా ఐటీ కంపెనీకి భూ కేటాయింపులు రద్దు చేయాలి



చినగదిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో అత్యంత ఖరీదైన భూములను ఊరూ పేరూ లేని ఉర్సా క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఐటీ కంపెనీల ఏర్పాటు నిమిత్తం రాష్ట్రప్రభుత్వం కేటాయించిన భూముల ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీపీఎం విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. హిల్ నెంబర్ 3లో టీసీఎస్‌కు కేటాయించిన దగ్గరే 3.6 ఎకరాల భూమిని, కాపులుప్పడలో 56 ఎకరాలను అతి తక్కువ ధరకు కేటాయించడం అవివేకమని విమర్శించారు. అది ఒక బోగస్ కంపెనీ అని, తక్షణమే ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములను వెనక్కు తీసుకోవాలని కోరారు. ఉర్సా సాఫ్ట్‌వేర్ కంపెనీకి భూకేటాయింపును నిరసిస్తూ మంగళవారం ఉదయం విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్ అయిన బోగస్ కంపెనీకి విలువైన ప్రభుత్వ భూములను ఉద్యోగాల పేరిట కేటాయించడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. తక్షణమే ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాలకే కేటాయించాలని, లేదంటే సీపీఎం తరఫున ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు డి.అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, జోన్ కమిటీ సభ్యులు పి.శంకరరావు, కె.కుమారి, ఐసీ నాయుడు, పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ, నాగరాజు, ఎం.లక్ష్మి, ఎన్.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన మిజోరం వర్సిటీ విద్యార్థులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఏయూను మిజోరం యూనివర్సిటీకి చెందిన సోషల్ వర్క్ విభాగ విద్యార్థులు సందర్శించారు. మంగళవారం ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఉపకులపతి ప్రత్యేకంగా మాట్లాడారు. సమాజంలో నేరుగా అనుబంధం కలిగి ఉండే విభాగంగా సోషల్ వర్క్‌నిలుస్తుందన్నారు. సమాజంలో విభిన్న వర్గాల ప్రజలు, వారి సమస్యలను పరిశీలించడం, పరిష్కారాల చూపడం, సమాజాభివృద్ధికి తోడ్పడే దిశగా యువత దృష్టి సారించాలని విద్యార్థులకు వీసీ సూచించారు. విద్యార్థుల బృందానికి మిజోరాం యూనివర్సిటీ ప్రొఫెసర్ కొట్టు శేఖర్ సారథ్యం వహించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజరావు పాల్గొన్నారు.

చందనయాత్ర భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- మేయర్ పీలా శ్రీనివాసరావు

సింహాచలం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూపదర్శనం చందనయాత్రలో పాల్గొనే భక్తులకు సకల సౌకర్యాల కల్పనకు జీవీఎంసీ కృషి చేస్తోందని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ అధికారులతో కలిసి మంగళవారం సింహగిరిపై క్షేత్ర పరిశీలన చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవంలో భాగంగా భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దేవాలయ పరిధిలోని తొమ్మిది ప్రాంతాల్లో 1,350 మంది పారిశుధ్య కార్మికులతో ఈనెల 29 నుంచి మే 2 వరకు పనులు చేపడతామన్నారు. కార్మికుల పనితీరును జోన్-8 శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సచివాలయ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పనుల నిర్వహణకు వీలుగా అధికారులకు వైర్‌లెస్ సెట్లను అందజేస్తున్నట్టు చెప్పారు. ఎండ వేడిమి దృష్ట్యా 193 పాయింట్లలో 5,600 వాటర్ క్యాన్లు, 56వేల అర లీటర్ వాటర్ బాటిల్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. 21 ప్రాంతాల్లో 401 తాత్కాలిక మరుగుదొడ్లు, ఐదు మొబైల్ టాయిలెట్లు, ఏర్పాటు చేశామన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్ పీవీ నరసింహం, ఈఈ టి శివప్రసాదరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్, జెడ్సీ హైమావతి, తదితరులున్నారు.

అప్పన్నను దర్శించుకున్న మేయర్ పీలా


కప్పస్తంభం వద్ద మేయర్ పీలా శ్రీనివాసరావు

సింహాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామిని జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పీవీ నరసింహం, బల్లా శ్రీనివాసరావులతో కలసి మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు అధికార లాంఛనాలతో ఏఈఓ ఎన్ ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నా తరువాత మేయర్ గోత్రనామాలతో అంతరాయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

అష్టోత్తర శత కలశ స్నపనానికి సన్నాహాలు


రజిత కలశాలను అలంకరిస్తున్న వైదికులు

సింహాచలం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం తరువాత ఈనెల 30 రాత్రి సహస్ర కలశ స్నపన తిరుమంజనానికి ఆలయ వైదికులు సన్నాహాలు చేశారు. ఇందులో భాగంగా ఆలయ భాండాగారం నుంచి అష్టోత్తర శత (108) రజిత కలశాలను తీసి, వాటిని రంగురంగుల సూత్రాలతో (దారాలతో) మంగళవారం శోభాయమానంగా అలంకరించారు. వాటిని ప్రధానాలయంలో భాగమండపం వద్ద బుధవారం ఉంచుతారు. రాత్రి శ్రీవైష్ణవ స్వాముల సహస్ర కలశాభిషేకం అనంతరం ఆలయ అర్చకస్వాములు ఈ రజిత కలశాలలో పంచామృతాలను, పలురకాల పండ్ల రసాలను తీసుకుని అష్టోత్తర శత కలశ స్నపనాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు.

హనీ గ్రూపు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

- 530 యూనిట్ల సేకరణ


రక్తదాన శిబిరంలో పాల్గొన్న హనీ గ్రూపు అధినేత ముక్కా ఓబుల్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : హనీగ్రూపు ఆధ్వర్యంలో లాసన్స్‌బే కాలనీలోని వారి కార్యాలయంలో మంగళవారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆ సంస్థ ఉద్యోగులు, యువకుల రక్తదానంతో 530 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సంస్థ ఛైర్మన్, వ్యవస్థాపకులు ముక్కా ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నగరంలోని తొమ్మిది బ్లడ్ బ్యాంకుల ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్ట్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ, రోటరీ క్లబ్ విజయనగరం, మదర్ బ్లడ్ సెంటర్, అమ్మ బ్లడ్ సెంటర్, విజయశ్రీ బ్లడ్ సెంటర్, విమ్స్ బ్లడ్ సెంటర్, లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ సిబ్బంది సేవలు అందించారు.

ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి 1:40 ఉండాలి

- పలు ఉపాధ్యాయ సంఘాల వినతి


డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఆరిలోవ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవో నెంబర్ 117ను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అలాగే పాఠశాలలను బలోపేతం చేసే విధంగా తీసుకోవడమే కాకుండా కార్యాచరణ అమలు చేయడం బాగుందని, ఇందుకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఎస్టీయూ పీఆర్టీయూ పండిత్ పరిషత్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పుడు జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల్లో మొదటి సెక్షన్‌కు విద్యార్థి ఉపాధ్యాయుని నిష్పత్తి 1:53గా నిర్ణయించడం వలన చాలా వరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు చాలా జిల్లాలో మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోందన్నారు. గతంలో కూడా విశాఖ జిల్లా నుంచి కొన్ని పోస్టులను కోల్పోయి ఇతర జిల్లాలకు ఇవ్వడం జరిగిందన్నారు. మళ్లీ అటువంటి పరిస్థితి రాకుండా మొదటి సెక్షన్ నుంచి 1 : 40 నిష్పత్తిలో పోస్టులను కేటాయించడం వలన ప్రతి విద్యార్థికి వ్యక్తిగత పర్యవేక్షణ చేయడమే కాకుండా పూర్తి స్థాయిలో న్యాయం చేయడానికి ఉపాధ్యాయుడికి అవకాశం ఉంటుందన్నారు. దీనిపై జిల్లా విద్యా శాఖాధికారి సూచనను ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయ ఐక్య కూటమి తరఫున ఎస్టీయూ, పండిత్ పరిషత్, పీఆర్టీయూ ప్రధాన ఉపాధ్యాయుల సంఘాలు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌కు మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ అసోసియేషన్ నుంచి ఎస్టీ యూ, ఇమంది పైడిరాజు, బాబు లాల్ పీఆర్టీయూ నుంచి గోపీనాథ్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఎ.జోగారావు, ఎంవీ కృష్ణా కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ప్రశ్నిస్తే అరెస్టు చేయడం అన్యాయం

- బీసీ సంఘం నేతల ఆగ్రహం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నేతలు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : బీసీల కులగణన చేపట్టాలని ర్యాలీగా వెళ్తున్న వారిని పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని విశాఖపట్నం బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీ పదో సెక్టరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశాఖ బీసీ సంఘం నాయకులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందే బీసీలకు రక్షణ చట్టం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిందని, ఓబీసి కుల జనగణన వెంటనే చేపట్టాలని, 33 శాతం మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళల రిజర్వేషన్ తేల్చాలని నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలో సోమవారం జరిగిన ర్యాలీలో డబ్బై ఏళ్ల వయసున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును అరెస్టు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్ని శ్రీనివాస్, ఉత్తరాంధ్ర కన్వీనర్ గొర్లె శ్రీనివాస నాయుడు, బీసీ ఉద్యోగుల అధ్యక్షులు వైవీ వెంకటేశ్వరరావు, విశాఖ సంఘం గౌరవ అధ్యక్షులు కామన వెంకట సుబ్బారావు, బీసీ, ఎస్టీ మైనారిటీ సంఘం కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, విశాఖ కార్యదర్శి ప్రసాద్, బీసి నాయకురాలు దీప్తి, డాక్టర్ గాయత్రిదేవి, శ్రీనివాసరావు, బీఎస్‌పి జిల్లా అధ్యక్షులు విశ్వనాథం, బీసీ సంఘం నాయకులు కె వెంకట ఉమా మహేష్, కొప్పిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో శరవేగంగా అభివృద్ధి: ఎంపీ కలిశెట్టి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు

మహారాణిపేట (విశాఖపట్నం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఇప్పుడు శరవేగంగా అభివృద్ధి చెందుతోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం విశాఖ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు వెనుకబడి ఉండిపోయిన ఉత్తరాంధ్ర కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతీ క్షణం ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ఆలోచిస్తున్నారని అన్నారు. భోగాపురం విమానాశ్రయం శరవేగంగా పూర్తవుతోందని, ఉత్తరాంధ్ర నుంచి ఇతర రాష్ట్రాలకు జాతీయ రహదారులు అనుసంధానమవుతున్నాయని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ జరిగిన భూ దందాలు అన్నీ ఇన్నీ కావని, రాజగురువు శారదా పీఠానికి అడ్డగోలుగా భూములు ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం గద్దె దిగటానికి కారణం భూ దందాలు, భూ కబ్జాలు, మాయలేనని ఆక్షేపించారు. గత పది నెలల్లో ఎన్నో ఐటీ కంపెనీలు విశాఖకు తరలివచ్చాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకుంటుందని, అర్థరాత్రులు జీవోలు విడుదల కావడం లేదని, అర్థరాత్రులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయటం లేదని, వైసీపీ అవాస్తవ ఆరోపణలు మానుకుని పరిపాలనకు సహకరించాలని కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు.

ఉత్తరాంధ్రలో సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి జరగాలి

▸ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య సూచన



మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణయ్య

మహారాణిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో సుస్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి జరగాలని, ఇందుకు అన్నివిధాలా సహకరిస్తామని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ సి.కృష్ణయ్య అన్నారు మంగళవారం హోటల్ గ్రీన్ పార్కులో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఫార్మా కెమికల్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ పరిశ్రమ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఉత్పత్తిని సాధించాలని, పరిశ్రమలలో వ్యర్థాలను సాధ్యమైనంతవరకు తగ్గించాలని, అవసరమైతే గ్రీన్ టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. సంస్థ సీఈ ప్రసాద్ మాట్లాడుతూ మెరైన్ స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్ ప్రకారం ఫార్మా కంపెనీలు తమ వ్యర్థాలను విడుదల చేయాలని సూచించారు ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు

భారత రాజ్యాంగం అందరికీ మార్గదర్శకం



పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన పోర్టు అథారిటీ చైర్‌పర్సన్ ఎం.అంగముత్తు, చిత్రంలో పోర్టు అధికారులు

మహారాణిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ నేతృత్వంలో రూపొందించిన భారత రాజ్యాంగం ప్రతీ పౌరునికి మార్గదర్శకమని, ఆయన సేవలు చరిత్రాత్మకంగా నిలుస్తాయని పోర్టు అథారిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం పోర్టు పరిపాలనా భవనం సాంబమూర్తి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి చైర్‌పర్సన్ అంగముత్తు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సమావేశంలో డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే, పీఎస్ఎల్ స్వామి, ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం అధ్యక్షుడు జి.ఉమా మహేశ్వరరావు, ఎం.దేవీశ్వరరావు, రామలింగం, జి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

సమయానికి తెరుచుకోని వార్డు సచివాలయాలు



తెరుచుకోని సచివాలయం తలుపులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డులోని సచివాలయాలు ఎప్పుడు తెరుస్తారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ వార్డులోని శ్రీనివాసనగర్ ప్రజారోగ్య కేంద్రం మేడపై 242, 243 సచివాలయాలు ఉన్నాయి. ఇవి ఎప్పుడు తెరుచుకుంటాయో స్థానికులకు తెలియని పరిస్థితి. సచివాలయాలు ప్రతి రోజు ఉదయం 10 గంటలకు తెరుచుకోవాల్సి ఉండగా సమయం గడిచినా బాధ్యులు కానరారని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం 10-15 గంటలు దాటినా రెండు సచివాలయాలు తెరుచుకోలేదు. దీంతో వివిధ పనులపై వచ్చిన స్థానికులు ఇబ్బంది పడ్డారు. రోజూ ఇదే పరిస్థితి ఉందంటున్నారు. ఒక వేళ సమయానికి తెరుచుకున్నా సిబ్బంది పూర్తి స్థాయిలో రావడం లేదని చెబుతున్నారు. సచివాలయానికి వెళ్తే అక్కడ సిబ్బంది లేక పోవడంతో సంబంధిత సిబ్బంది లేరా? అని మిగతా సిబ్బందిని అడిగితే ఫీల్డ్‌లోకి లేదా జోనల్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారని చెబుతుంటారు. వివిధ రకాల సేవలను స్థానికులకు అందుబాటులో ఉంచేందుకు గత ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసింది. కొద్ది రోజులు సిబ్బంది సక్రమంగా విధులకు హాజరయ్యారని, రోజులు గడిచినకొద్దీ సమయపాలన పాటించడం లేదని పేర్కొంటున్నారు. తాము సచివాలయాలకు వెళ్లి గంటల కొద్దీ నిరీక్షించడమే తప్ప వారి దర్శనం కలగడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల్లో సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మేయర్‌కు సచివాలయ ఉద్యోగుల అభినందన



మేయర్ పీలా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

మహారాణిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు నూతన మేయర్ పీలా శ్రీనివాసరావును మంగళవారం సన్మానించారు. వార్డు పరిపాలన కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు పి.వి. కిరణ్‌కుమార్, ఇతర సభ్యులు పీలా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందించి శుభాభినందనలు తెలిపారు. సంఘం విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు, చింతకాయల బంగార్రాజు, బి.వి.అశోక్ కుమార్, ఇ.పవన్‌కుమార్, సాయికృష్ణ, నానాజీ తదితరులు మేయర్‌ను కలిసినవారిలో ఉన్నారు.

మహా పాదయాత్ర పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉషా చీరాల, ఇతర ప్రముఖులు

సీతంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రచయిత అడపా రామకృష్ణ రచించిన 'మహా పాదయాత్ర' పుస్తకాన్ని మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రచయిత, నటులు మేడా మస్తాన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏయూ ఇంజనీరింగ్ విభాగం అంతర్జాతీయ, జాతీయ జర్నల్స్ అడ్జాక్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషా చీరాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రం రెండుగా విడిపోయి ఎన్నో ఆటంకాలు ఎదురై, మహిళలంతా ఉద్యమించాక ఇప్పుడు అమరావతిని రాజధానిగా చెప్పుకొంటున్నామన్నారు. అడపా రామకృష్ణ మహిళల ధైర్య సాహస కృత్యాలే దృశ్యమానంగా మలిచారన్నారు. పుస్తకాన్ని డాక్టర్ కెవిఎస్ మూర్తి సమీక్షించారు. పుస్తక రచయిత అడపా రామకృష్ణ తన అనుభవాన్ని పంచుకున్నారు. శిరేల సన్యాసిరావు, సీహెచ్ చిన సూర్యనారాయణ, సునర్ల సర్వేశ్వర శాస్త్రి, ఎం.పరమేశ్వరరావు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

5న దాసరి జయంతి వేడుకలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హెల్ప్ టు హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ తెలుగు చలనచిత్ర దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వీఎఫ్ఎస్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. మే 5న సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో ప్రత్యేక సమావేశం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మీగడ శివశ్రీ దర్శకత్వంలో రూపుదిద్దుకొని నాగభట్ల రఘురాం నిర్మాతగా అవార్డులు పొందిన లఘుచిత్రాలు ప్రదర్శిస్తామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న వారితో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని బీజేపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో పలువురికి మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సహాయార్థులకు సుమారు రూ.9 లక్షల చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, బీజేపీ ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ సురేష్ బాబు, కార్పొరేటర్ హనూక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి పట్టివేత

సీతంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి సంచులతో ఉన్న ఇద్దరిని సీతమ్మధార ప్రొహిబిషన్ అధికారులు పట్టుకున్నారు. జ్ఞానాపురం రైల్వేస్టేషన్ అవుట్‌గేట్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు ఉన్నారని ఇన్‌స్పెక్టర్ బి.నాగవేణికి సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. వారిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా 10 కేజీల గంజాయి లభ్యమైంది. ఇద్దరినీ జిల్లా ఎక్సైజ్ మేజిస్ట్రేట్ ద్వారా రిమాండ్‌కు పంపినట్టు ఇన్‌స్పెక్టర్ నాగవేణి తెలిపారు. నిందితుల వివరాలు వెల్లడించలేదు.



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

ఉత్తమ ఉపాధ్యాయులను ఎవరూ మర్చిపోలేరు : డీఈవో ప్రేమ్‌కుమార్

తగరపువలస, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సేవలను అందించి విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు ఎల్లకాలం విద్యార్థుల మదిలో ఉండిపోతాడని జిల్లా విద్యాశాఖాధికారి పి.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం తగరపువలస ఫంక్షనుహాలులో జరిగిన చిట్టివలస గెజిటెడ్ హెచ్ఎం పి.మురళీమోహనరావు సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో చదువు చెప్పిన ఉపాధ్యాయులను ప్రతివారు జీవితాంతం గుర్తుంచుకుంటారని అన్నారు.

హనీ గ్రూపు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

▸ 530 యూనిట్ల సేకరణ




రక్తదాన శిబిరంలో పాల్గొన్న హనీ గ్రూపు అధినేత ముక్కా ఓబుల్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): హనీ గ్రూపు ఆధ్వర్యంలో లాసన్స్‌బే కాలనీలోని వారి కార్యాలయంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆ సంస్థ ఉద్యోగులు, యువకులు 530 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సంస్థ చైర్మన్, వ్యవస్థాపకులు ముక్కా ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నగరంలోని తొమ్మిది బ్లడ్ బ్యాంకుల ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్ట్, ఎ ఎస్ రాజా బ్లడ్ బ్యాంకు, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ, రోటరీ క్లబ్ విజయనగరం, మదర్ బ్లడ్ సెంటర్, అమ్మ బ్లడ్ సెంటర్, విజయశ్రీ బ్లడ్ సెంటర్, విమ్స్ బ్లడ్ సెంటర్, లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ సిబ్బంది సేవలు అందించారు.

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

భీమునిపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు కెరటాల్లో చిక్కుకుని మృతిచెందాడు. ఈ సంఘటన భీమిలిలో జరిగింది. బోయవీధికి చెందిన చింతపల్లి తాతారావు(60) సోమవారం సాయంత్రం సాగరసంగమములో విసిరి వలతో వేటకు వెళ్లాడు. పెద్ద కెరటం ధాటికి గుర్రై కొట్టుకుపోయాడు. రాత్రికి ఇంటికి రాలేకపోవడంతో కంగారుపడిన కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం తీరంలో గాలించగా అన్నవరం సమీపంలో మృతదేహం కనిపించడంతో భోరున విలపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పైడమ్మ, కుమారులు పోలిరాజు, అప్పన్న, నూకరాజు, కుమార్తె నందిని ఉన్నారు.




తాతారావు (ఫైల్)

యువకుడి ఆత్మహత్య

సీతంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలం కావడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన చుక్కల పవన్ (25) ఇసుకతోటలోని ఓ లాడ్జిలో పనిచేసేవాడు. ఓ యువతితో ప్రేమ విఫలమైంది. అలాగే అప్పులపాలయ్యాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా సీఐ రమణ, ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

'ప్రభుత్వాన్ని చేతిలో పెట్టుకొని పెట్టుబడిదారుల దందా'



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ వీసీ ప్రొఫెసర్ కె.ఎస్.చలం, చిత్రంలో ఇతర ప్రముఖులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని చేతిలో పెట్టుకొని గుత్త పెట్టుబడిదారులు మన ఆస్తులను, భూములను కొట్టేస్తున్నారని ద్రవిడియన్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కె.ఎస్.చలం విమర్శించారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వార్వా నివాస్ సంయుక్త ఆధ్వర్యంలో 'విశాఖలో ప్రభుత్వ భూములు, ఆస్తుల బదలాయింపు'పై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విస్తారంగా ఉన్న రక్షిత అడవులను, తీర ప్రాంతాన్ని చేజిక్కించుకుంటున్నారన్నారు. చివరికి మన తీర ప్రాంతం ఆదాని కోస్ట్‌గా మారిపోయిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి అంటే ప్రజలదని, అటువంటిది ప్రజాప్రయోజనం కోసం వినియోగించాలన్నారు. పర్యావరణ కార్యకర్త సోహన్ హటంగడి మాట్లాడుతూ నగరానికి ప్రాణవాయువు సరఫరా చేసే ప్రాంతాన్ని ఎకరా 99 పైసల చొప్పున 22 ఎకరాలు టాటా కంపెనీకి ఇచ్చేయడానికి అది ఏమైనా పేద సంస్థా? అని ప్రశ్నించారు. నగరంలో పచ్చని ప్రదేశాలను కాంక్రీట్ అడవులుగా మార్చేస్తున్నారన్నారు. ఇటువంటి వాటిని మనమంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వార్వా అధ్యక్షుడు ఎన్.ప్రకాశరావు అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి బీబీ గణేష్, పిట్టా నారాయణమూర్తి, బి.గురప్పనివాస్, హరిప్రసాద్, బి.ఎల్.నారాయణ పాల్గొన్నారు.

మేలో ఏపీ ఎక్స్‌ప్రెస్, స్వర్ణ జయంతి రైళ్లు రద్దు

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని మహబూబాబాద్ స్టేషన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్నందున మే 23 నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805/ 20806) మే 27, 28, జూన్ 18, 19న రెండు వైపులా రద్దు చేశారు. అలాగే విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12803) మే 23, 26, జూన్ 16న, తిరుగు ప్రయాణంలో ఇదే ఎక్స్‌ప్రెస్ (12804) మే 25, 28, జూన్ 18న రద్దు చేశారు.

దారి మళ్లింపు

మే 22, 28న విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (18519/18520); మే 27, 28న షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045); మే 28, 29న హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046) రైళ్లు విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా నడుస్తాయి. మే 27, 28న ముంబయి-భువనేశ్వర్-ముంబయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (11019/11020) పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు, విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. మే 22, 29న విశాఖ-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (20803), మే 25, జూన్ 22న గాంధీధాం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20804) రైళ్లు లాక్‌హోలి, రాయపూర్, నాగపూర్, బాద్నెరా మీదుగా నడుస్తాయి. షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (22849) మే 28న విశాఖ, విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా నడుస్తుంది.

రీ షెడ్యూల్

మే 24, 28న విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-మహబూబ్‌నగర్ (12861) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మహబూబాబాద్‌లో హాల్ట్ ఉండదు. మే 24, 25, 26న భువనేశ్వర్-ముంబయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు (11020)....మే 25, 26న షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (18045) మహబూబాబాద్ స్టేషన్‌లో హాల్ట్ ఉండదు. మే 29న విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఒక గంట 15 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరనుంది.

బెంగళూరు రైళ్లకు డిమాండ్

విశాఖ-బెంగళూరు, విశాఖ-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లకు డిమాండ్ నెలకొంది. విశాఖ-బెంగళూరు ప్రత్యేక రైలుకు (08581) తీవ్ర డిమాండ్ కనిపిస్తోంది. బెంగళూరుకు విశాఖ నుంచి స్థిరమైన (ఒరిజినేటింగ్) రైలు లేకపోవడంతో ప్రత్యేక రైలుకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, హౌరా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ వంటి రోజూ నడిచే రైళ్లు మినహా మిగిలినవి వారాంతపు సర్వీసులు కావడం కూడా ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో ప్రతి బుధవారం మధ్యాహ్నం 3.20 గంటలకు విశాఖ నుంచి బెంగళూరుకు బయలుదేరే 08581 నంబరు గల రైలుకు మే 25 వరకు అన్ని తరగతులలో బెర్తులు నిండిపోయాయి. విశాఖ-బెంగళూరు ప్రత్యేక రైలు సర్వీసులను కొద్దికాలం పొడిగించడమే కాకుండా వారానికి రెండు రోజులు అందుబాటులో ఉండేలా ఫ్రీక్వెన్సీ పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

పెరుగుతున్న ఆశావహులు

... 5వ పేజీ తరువాయి

చెందిన మహిళను తాము మేయర్‌ను చేస్తే ఇస్తే ఆమెను తొలగించి వేరొక సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్‌కు ఆ పదవిని ఇచ్చారంటూ వైసీపీ నేతలు విమర్శలు ప్రారంభించారు. ఆ విమర్శలను తిప్పికొట్టాలంటే డిప్యూటీ మేయర్ పదవిని యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళకు ఇవ్వాలని కూటమి ప్రజా ప్రతినిధులు భావిస్తున్నారు. ఆ సామాజిక వర్గానికి చెందిన మహిళా కార్పొరేటర్లు టీడీపీలో మొల్లి హేమలత (5వ వార్డు), గొలగాని మంగవేణి (18 వార్డు), జనసేనలో పుర్రె పూర్ణశ్రీ (59వ వార్డు) ఉన్నారు. పూర్ణశ్రీ వైసీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి ఇటీవలే జనసేనలో చేరినందున ఆమెకు జనసేన నుంచి డిప్యూటీ మేయర్ పదవికి బీఫారం ఇచ్చేందుకు అవకాశం లేదు. ఒకవేళ డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నా సరే ఆమె వైసీపీకి చెందినవారిగానే అధికారికంగా పరిగణిస్తారు. దీంతో టీడీపీకి చెందిన మొల్లి హేమలత, గొలగాని మంగవేణి మధ్యే పోటీ ఉంటుంది. వారిద్దరిలో అయితే విద్యావంతురాలైన మొల్లి హేమలత వైపు నేతలు మొగ్గుచూపే అవకాశం ఉంటుంది. కాగా ప్రస్తుతం అవిశ్వాస తీర్మానంతో డిప్యూటీ మేయర్ పదవిని కోల్పోయిన జియ్యాని శ్రీధర్ కాపు సామాజిక వర్గానికి చెందినవారు. అందువల్ల ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఆ పదవిని ఇవ్వకపోతే వారి నుంచి విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉందని కూటమిలో మరో వర్గం నేతలు ఆలోచిస్తున్నారు. అదే జరిగితే జనసేనలో కాపు సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు లేనందున టీడీపీ కార్పొరేటర్లకే అవకాశం దక్కుతుంది. అలా చూస్తే 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పేర్లు పరిశీలనకు వస్తాయి. వారిలో ప్రస్తుతం డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న గంధం శ్రీనివాసరావుకు రెండుసార్లు కౌన్సిలర్‌గా, రెండుసార్లు కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో డిప్యూటీ మేయర్ పదవికి ఇటీవల జరిగిన సమావేశంలో కొందరు ప్రజా ప్రతినిధులు ఆయన పేరును సూచించినట్టు తెలిసింది. మరోవైపు బొండా జగన్నాథం, బల్ల శ్రీనివాసరావు, పిసిని వరహానర్సింహం పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. మరోవైపు మేయర్‌పై అవిశ్వాస తీర్మానంలో బీజేపీ ఓటు కీలకంగా మారినందున నగరంలో పార్టీ బలోపేతం కోసం డిప్యూటీ మేయర్ పదవి తీసుకోవాలంటూ కార్పొరేటర్ గంకల కవిత డిమాండ్ చేస్తున్నారు. ఈ వారంలోనే డిప్యూటీమేయర్ ఎన్నిక నోటిఫికేషన్ వస్తుండడంతో ఏం జరుగుతుందనే దానిపై కూటమి నేతలు, కార్పొరేటర్లు, కార్యకర్తల్లో కూడా ఆసక్తి నెలకొందనే చెప్పుకోవాలి.

సింహగిరికి ఉత్సవ శోభ

... 5వ పేజీ తరువాయి

మంగళవారం సాయంత్రానికి సింహగిరికి చేరుకున్నారు. దేవస్థానం ఏర్పాటుచేసిన ఉచిత దర్శనం క్యూలో వేచిఉన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం అధికారులు రంగురంగుల విద్యుత్ దీపాలతో సింహగిరిని శోభాయమానంగా అలంకరించారు. అదేవిధంగా క్యూలను గతంకంటే ఎక్కువగా నిర్మించారు. ఎక్కడికక్కడ తాగునీటి సదుపాయం కల్పించారు. అనేకచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. దివ్యాంగులను సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ దర్శనానికి అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం సింహగిరిపై పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్యూలు, బారికేడ్లు, మజ్జిగ, తాగునీటి పంపిణీ వంటి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సూచిక బోర్డులను ఎక్కువసంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కొండ దిగువన కొత్తఘాట్‌రోడ్డు, న్యూ గోశాల, పాత గోశాల రోడ్లలో ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, దేవదాయ శాఖ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. పార్కింగ్ ప్రాంతాలను, సైన్‌బోర్డులను చూడడంతో పాటు పోలీసు కంట్రోల్ రూమ్ వ్యవస్థపై కూడా పలు సూచనలిచ్చారు.

చందనోత్సవ టిక్కెట్లకు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

టిక్కెట్లు మరో 150 చొప్పున ఇచ్చారు. అంతరాలయ దర్శన టిక్కెట్లు ఇంకా కావాలని కొందరు పట్టుబట్టగా ఇవ్వలేమని అధికారులు స్పష్టంచేశారు. అధికారుల అంచనా ప్రకారం ప్రొటోకాల్ ద్వారా సుమారుగా మూడు వేల మందికి అంతరాలయ దర్శనం జరిగే అవకాశం ఉంది. ఉదయం ఆరు తరువాత అంతరాలయ దర్శనం ఉండదని ప్రకటించినా నాలుగు గంటలకు ప్రారంభించి ఆరు గంటలలోపు దర్శనాలు ముగించడం సాధ్యం కాదు. కాబట్టి ఉదయం పది గంటల వరకూ వీఐపీలు, అంతరాలయ దర్శనాలు ఉండవచ్చునంటున్నారు.

ప్రణాళిక విజయవంతమైతే మేలు చేసినట్టే

గత ఏడాది ఎన్నికల కోడ్ వల్ల అధికారులకు ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం తప్పింది. దాంతో ఊపిరి పీల్చుకొని సామాన్య భక్తులకు రెండు గంటల్లో దర్శనం చేయించగలిగారు. ఈసారి వ్యూహాత్మకంగా వ్యవహరించినందున సామాన్య భక్తులకు సులువుగా దర్శనం జరగాల్సి ఉంది. ఈ ప్రణాళిక విజయవంతమైతే అధికారులు భక్తులకు మేలు చేసినట్టే.

పీహెచ్‌డీ ప్రవేశాల్లో జాప్యం

... 5వ పేజీ తరువాయి

నిర్వహించకపోతే మొత్తం ఫండ్ వెనక్కి వెళ్లిపోతుందని పేర్కొంటున్నారు. ఇదిలావుంటే ఇప్పటివరకూ సెప్టెంబరులో నిర్వహించిన యూజీసీ నెట్‌కు సంబంధించిన అడ్మిషన్స్‌నే అధికారులు చేపట్టలేదు. డిసెంబరులో కూడా యూజీసీ నెట్ నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫలితాలు కూడా వెలువడ్డాయి. వాటికి సంబంధించిన అడ్మిషన్లు ఇంకెప్పుడు చేపడతారోనన్న ఆందోళనను అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పీడీఎస్‌వో విద్యార్థి సంఘ నేతలు వీసీని కలిసి తెలియజేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ అడ్మిషన్స్ ప్రక్రియను పూర్తి చేయాలని పీడీఎస్‌వో విద్యార్థి సంఘ నేత భాను కోరారు.

దంపతుల హత్య కేసులో పోలీసులకు క్లూ?

... 5వ పేజీ తరువాయి

అనుబంధంగా ఉన్న వాష్‌రూమ్‌కు రెండు వైపులా తలుపులు ఉన్నాయి. వాటి ద్వారా ఒక పడక గది నుంచి మరో పడక గదిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఈ విషయాన్ని యోగేంద్రబాబు కుమార్తె శిల్ప పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. నిందితులు ముందు తండ్రిపై దాడి చేసి ఉంటారని, ఆయన తల్లిని హెచ్చరించి మరో పడక గదిలోకి పంపించేసి ఉంటారని, తండ్రిని చంపిన తరువాత వారు వాష్‌రూమ్ ద్వారా తల్లి ఉన్న పడక గదిలోకి వెళ్లి ఆమెపై దాడి చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. అంటే...ఇంట్లో వాష్‌రూమ్‌కు రెండు తలుపులు ఉన్నాయని తెలిసిన వారే ఈ పని చేశారని ఆమె అభిప్రాయపడ్డారు. పోలీసులు ఈ కోణంలోను దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ ఈ కేసులో ఇప్పటివరకూ నాలుగు క్లూలు (ఆధారాలు) లభించాయని, వాటి ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారని, త్వరగానే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. ఇటీవల విశాఖపట్నం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు ఈ కేసు పురోగతి గురించి ఆరా తీయడంతో పోలీసులు వీలైనంత వేగంగా దీనిని ఛేదించాలని ప్రయత్నిస్తున్నారు.

మురుగు పోయే దారేది!

- డ్రైనేజీలు లేకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోతున్న వాడుక నీరు
- దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న 79వ వార్డు ప్రజలు



మురుగు ప్రవహించే మార్గం లేక రోడ్డుపై చేరిన దృశ్యం. (ఇన్‌సెట్లో) ఇళ్ల ముందు నిలిచిన మురుగు నీరు

అగనంపూడి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి కూడలి, పండా వీధి ప్రాంతాలను డ్రైనేజీ సమస్య పట్టి పీడిస్తుంది. పెరుగుతున్న నివాసాలకు తోడు అపార్ట్‌మెంట్ల నిర్మాణంతో గ్రామాలు విస్తరించాయి. అయినప్పటికీ పూర్తి స్థాయిలో డ్రైనేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు, వాడుక నీరు రహదారులపై పారుతున్నాయి. పలుచోట్ల ఇళ్ల మధ్యే మురుగు నీరు తిష్ట వేస్తోంది. దీంతో పారిశుధ్యం కీణించి భరించరాని దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు విజృంభిస్తున్నాయని, రాత్రిపూట కంటిమీద కునుకు లేదుకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా దినాదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో మౌలిక వసతులు లేకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పూర్తి స్థాయిలో డ్రైనేజీలను ఏర్పాటు చేయడంతో పాటు ఉన్నవాటి ఎత్తు పెంచాలని పలుమార్లు అధికారులను కోరినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. పలుచోట్ల సీసీ రోడ్లకు సమాంతరంగా డ్రైనేజీలు ఉండడంతో మురుగు నీరంతా రహదారిపైకి వస్తుండడంతో నివాసితుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటుంది. అందువల్ల అధికారులు పట్టించుకుని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- 530 మంది మత్స్యకారులకు రూ.కోటీ ఆరు లక్షల జీవన భృతి చెక్కుల అందజేత



దిబ్బపాలెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. సముద్రంలో చేపల వేట సాగించే వారికి మత్స్యకార భృతి కింద రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.కోటీ ఆరు లక్షల చెక్కులను గాజువాకలోని దిబ్బపాలెంలో 530 మంది గంగపుత్రులకు మంగళవారం పల్లా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలో వేట విరామ సమయంలో ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వారికి జీవన భృతిని అందజేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన ప్రతి హామీని తాము నెరవేరుస్తున్నామన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గంగపుత్రుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు మరిన్ని కార్యక్రమాలను చేపడతామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు ఇచ్చిన మొత్తాన్ని రెట్టింపు చేయడం జరిగిందన్నారు. మరిన్ని ఫిషింగ్ హార్బర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, లీటరు డీజిల్‌పై తొమ్మిది రూపాయల సబ్సిడీ, మత్స్యవేట సమయంలో ప్రాణ భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో మత్స్యకార కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు.. అధికారులు పట్టించుకోరు!

- పైపు లైన్లు లీక్ అవుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని ప్రజల ఆవేదన



86వ వార్డు డాక్‌యార్డు కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద వృథాగా పోతున్న నీరు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్ డాక్‌యార్డు కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతోంది. అలాగే కణితి, రాజులపాలెం, గవరవీధి, అప్పికొండ పరిసర ప్రాంతాల్లో పైపు లైన్లకు లీకేజీలు ఏర్పడి తాగునీరంతా వృథాగా పారుతూ మురుగు కాలువల్లో కలుస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండువేసవిలో ఒకపక్క నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పలుచోట్ల పైపు లైన్ల లీకేజీతో తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని పలువురు వాపోతున్నారు. పైపు లైన్ల లీకేజీ వల్ల కొళాయిల ద్వారా తమ ఇళ్లకు పూర్తి స్థాయిలో నీరందడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని వారు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాశీప్రసాద్

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల మన్ననలు పొందాలి

ఏఎస్ఐ కాశీప్రసాద్

పెందుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహణ ద్వారా ప్రజల మన్ననలు పొందితే పలు కేసుల విచారణలో సత్ఫలితాలను సాధించగలమని ఏఎస్ఐ కాశీప్రసాద్ అన్నారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆదేశాల మేరకు చినముషిడివాడలో వార్డు, గ్రామ మహిళా పోలీసులతో మంగళవారం శాంతిభద్రతలు, ఫ్రెండ్లీ పోలీసింగ్ అంశంపై ఏఎస్ఐ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు ఏ రూపంలో వచ్చినా పరిష్కరించడం పోలీసుల బాధ్యతని అని అన్నారు. పోలీసులంటే ప్రజల్లో ఫ్రెండ్లీగా ఉంటారనే భావనను కలిగించాలని సూచించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

బీఎంఎస్ నూతన కార్యవర్గం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం స్టీల్‌ప్లాంట్ సీడబ్ల్యూసీ-1లో ఎన్నుకున్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడిగా కొమ్మినేని శ్రీనివాసరావు (విశాఖ స్టీల్‌ప్లాంట్), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అమర్‌కుమార్ జైస్వాల్ (రూర్కెల), కార్యదర్శిగా రంజయ్‌కుమార్ (బొకారో), డిప్యూటీ జనరల్ సెక్రటరీగా రాజేశ్ విశ్వకర్మ (బొకారో)లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొమ్మినేని మాట్లాడుతూ దేశంలో ఉక్కు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని, విశాఖ స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే ఉంచే విధంగా కృషి చేస్తామన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 22, పచ్చిమిర్చి 20, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 14, క్యారెట్ 30 దొండకాయలు 22, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, అల్లం (పాతది)46, మునక్కాడలు (కిలో) 34, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, కొబ్బరికాయ (పెద్దది) 25, వెల్లుల్లి (పెద్దవి) 100, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 24, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 34, కంద 80, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలీ 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

ఉక్కు రిలే నిరాహార దీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షల కార్యాచరణను మంగళవారం ఉక్కు పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్ రావు ప్రకటించారు. మే 1, 6, 9, 14, 19, 22, 26, 31 తేదీల్లో ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు దీక్షా శిబిరంలో కూర్చుంటారన్నారు. అలాగే 2, 7, 10, 15, 20, 29 తేదీల్లో ఇంటక్, 3, 8, 13, 17, 21, 24, 30 తేదీల్లో సీఐటీయూ, 4న కాంట్రాక్టు కార్మికులు (ఇంటక్), 5న డీఎస్ఈయూ, టీఎన్‌టీయూసీ నాయకులు దీక్షల్లో పాల్గొంటారని తెలిపారు. 11న కాంట్రాక్టు కార్మికులు (సీఐటీయూ), 12న ఓబీసీ అసోసియేషన్, 16, 28 తేదీల్లో యూజ్, సీఐటీయూ, వీఎస్ఎంఎస్, వీఎస్ఈయూ, వీఎస్‌పీఈయూ, 18న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 25న కాంట్రాక్టు కార్మికులు (టీఎన్‌టీయూసీ), 27న సీఎఫ్‌టీయూఐ యూనియన్‌లకు చెందిన నాయకులు, కార్మికులు దీక్షల్లో కూర్చుంటారని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాడతాం

- ఎన్ఎంయూ స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో నాయకులు



స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్న నాయకులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాడతామని స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో దీక్షలబూనిన ఎన్ఎంయూ నాయకులు స్పష్టం చేశారు. ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఎన్ఎంయూ రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా డిపో సెక్రటరీ జి.సాయిరామ్ మాట్లాడుతూ ఈ దీక్షల వల్ల కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా కార్మికులంతా సిద్ధంగా ఉండాలన్నారు. గ్యారేజీలో అన్ని రకాల టూల్స్‌ను అందుబాటులో ఉంచాలని, సరిపడా సిబ్బందిని నియమించాలని, అన్ని సిక్ లీవ్‌లపై జీతాలను ఇప్పించాలని, అక్రమ కేసులు బనాయించి కార్మికులను సస్పెండ్ చేసే విధానాలను యాజమాన్యం విడనాడాలని డిమాండ్ చేశారు. మహిళా సిబ్బందికి చైల్డ్ కేర్ సెలవులను ఇప్పించాలని, మరమ్మతులకు గురైన టిమ్ డ్యామేజీల బాధ్యతను యాజమాన్యమే భరించాలని, 2019 ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఆర్టీసీలో పాత పద్ధతిలోనే వైద్య సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎల్ రావు, రమణ, కృష్ణ, బాపూజీ, ఎస్‌బీ రావు, వేణి, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సింహాచల డిపోలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి సంస్థ ద్వారా జీతాలు చెల్లించాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి శంకరరావు, డిపో నాయకులు డీఏ నాయుడు, జేఎస్ఎన్ రాజు, బీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



క్యాంటీన్ సిబ్బందికి సూచనలిస్తున్న జడ్సీ రాము

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన జడ్సీ

మల్కాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 కమిషనర్ రాము మంగళవారం శ్రీహరిపురంలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఇక్కడ భోజనాలు ఎలా ఉన్నాయో పలువురిని అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎంతమంది ఇక్కడ భోజనం, టిఫిన్లు చేసేందుకు వస్తున్నారో ఆరా తీశారు. క్యాంటీన్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. అనంతరం జోనల్ కమిషనర్ పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కశ్మీరులోని ఉగ్రదాడిని నిరసిస్తు షీలానగర్‌లోని విశాఖ డెయిరీ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం కరుణాకుమారి మాట్లాడుతూ దేశ ప్రజల ఐక్యతకు ఆటంకం కలిగించేలా ఉన్న ఉగ్రవాదాన్ని అంతం చేయాలని కోరారు. షీలానగర్ నుంచి జాతీయ రహదారి వరకు ఈ కొవ్వొత్తుల ర్యాలీ సాగింది. కార్యక్రమంలో విశాఖ డెయిరీ మేనేజర్ అదపురెడ్డి గోవిందరావు, కరణం పరమేశ్వర్, ఎన్‌సీసీ అధికారి శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో...

మల్కాపురం: ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం శ్రీహరిపురం నుంచి మల్కాపురం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎంవీ గిరి మాట్లాడుతూ కశ్మీరులో పర్యాటకులను విచక్షణా రహితంగా చంపిన ఉగ్రవాదులను తుదముట్టించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పి.ప్రసాద్‌రాజు, ఎం.రమేశ్, శ్రీను, మనోహర్, వాసు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రీహరిపురంలో ఉగ్రదాడిని నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు.

టీడీపీ 52వ వార్డు అధ్యక్షుడిగా వై.తిరుమలరావు

ఎన్.ఎ.డిజంక్షన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా వై.తిరుమలరావు (వైటీఆర్) ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రకటించారు. మంగళవారం 52వ వార్డుకు నూతన కమిటీని ఏర్పాటు చేసేందుకు గాను గణబాబు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షునిగా వైటీఆర్, క్లస్టర్ ఇన్‌చార్జిలుగా వి.చంద్రశేఖర్, కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఆడారి భాస్కరరావు, పి.అప్పారావు, సంయుక్త కార్యదర్శులుగా పీటీ నాయుడు, గణపతి, కోశాధికారిగా ఆర్.శ్రీనివాసవర్మతో పాటు పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మృతి



పద్మావతి (ఫైల్)

పెందుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి లిటిల్ ఫ్లవర్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వ్యవస్థాపక ప్రిన్సిపాల్ మంతెన పద్మావతి (57) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. నగరంలోని ఆమె నివాసంలో తెల్లవారుజామున గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించేలోగానే ఆమె కన్నుమూశారు. ఆర్థిక స్థోమత లేని ప్రతిభగల విద్యార్థులకు తమ పాఠశాలలో నామమాత్ర ఫీజులతో ఆమె విద్యనందిస్తున్నారు.



కార్ల పార్కింగ్ కోసం సిద్ధం చేసిన స్థలం

సింహగిరిపైకి 51 ఉచిత బస్సులు

వేపగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చందనోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి సింహగిరిపైకి ప్రయాణికులను ఉచితంగా తరలించేందుకు గాను 51 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసినట్టు సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సింహాచలం వచ్చే వాహనాలన్నీ గోపాలపట్నం పెట్రోల్ బంక్, శ్రీనివాసనగర్ మీదుగా గోశాల వరకు మాత్రమే నడుస్తాయన్నారు. చోడవరం, దేవరాపల్లి, కొత్తవలస, పెందుర్తి నుంచి వచ్చే బస్సులు వేపగుంట మీదుగా గోశాల వరకు నడుస్తుయని పేర్కొన్నారు.

కార్ల పార్కింగ్‌కు ఏర్పాట్లు

సింహాద్రి అప్పన్న స్వామి నిజరూప దర్శనానికి విచ్చేసే భక్తుల వాహనాలను పార్కింగ్ చేసేందుకు గాను పోలీస్, దేవస్థానం, జీవీఎంసీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా కార్లను నిలిపిందుకు గాను గోశాల పరిధిలో ఉన్న ఖాళీ ప్రాంతాలు, బీఆర్‌టీ.ఎస్ సెంటర్ రోడ్డుతోపాటు శ్రీనివాసనగర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న మామిడి చెట్లు ఉన్న ప్రాంతాలను చదును చేసి పార్కింగ్‌కు సిద్ధం చేశారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

గాజువాక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని గాజువాక శాఖా గ్రంథాలయాధికారి బి.చంద్రకళ కోరారు. మంగళవారం లైబ్రరీలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ కథలు చదవడం, రాయడం, పాటల పోటీలు, పెయింటింగ్‌లతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే విజ్ఞానం కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తామని, అందువల్ల ఆసక్తి గల విద్యార్థులు శిక్షణకు హాజరు కావాలని పేర్కొన్నారు.

కథలను చదవడం ఎంతో మంచిది

మల్కాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న వివిధ రకాల విషయాలను తెలుసుకోవాలంటే అనేక మంది రచయితలు రాసిన కథలను చదవడం ఎంతో అవసరమని ప్రముఖ చిత్రకారుడు, కళారత్న అవార్డు గ్రహీత సుంకర చలపతిరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. కథను చదివి అందులోని సందేశాన్ని ఒక డైరీలో రాసుకోవడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు విద్యార్థులు అనేక కథలను చదివి ఇతరులకు వివరించారు. మహిళా నాయకురాలు జగదాంబ, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్‌లు పలు నీతి కథల సారాంశాన్ని వివరించారు. అనంతరం జ్యోతిర్మయి ఆధ్వర్యంలో విద్యార్థులకు నృత్యంలో శిక్షణ ఇచ్చారు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

'విజ్ఞాన్'లో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

అగనంపూడి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా దువ్వాడ విజ్ఞాన్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన నృత్య ప్రదర్శన పోటీలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో విద్యార్థులు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యాలతో అబ్బురపరిచారు. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

మే డే వేడుకలను విజయవంతం చేయాలి

టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు



వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన నక్కా లక్ష్మణరావు, తదితరులు

మల్కాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ మొగుల్రాజపురంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ గ్రౌండులో మే ఒకటో తేదీన జరగనున్న మే డే వేడుకల్లో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనవలసిందిగా టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు మంగళవారం రామకృష్ణాపురం వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఈ వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎన్‌టీయూసీ ఎప్పుడూ కార్మికుల పక్షానే నిలబడుతుందన్నారు. ఇప్పటికే అనేక కంపెనీల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాము కృషి చేశామన్నారు.

అదృశ్యమైన ఇద్దరు వ్యక్తుల ఆచూకీ లభ్యం

పెందుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో అదృశ్యమైన ఇద్దరు వ్యక్తుల ఆచూకీని పోలీసులు కనుగొని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి, వేపగుంట ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి, మానసిక పరిస్థితి బాగోక ఓ యువకుడు అదృశ్యమయ్యారు. దర్యాప్తు చేసిన పోలీసులు వారిని కనుగొని కుటుంబీకులకు అప్పగించారు.

ఎక్మో చికిత్సతో కార్మికుడి ప్రాణాలను కాపాడిన వైద్యులు

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరమైన హైడ్రోజన్ సల్ఫైడ్‌ను పీల్చి ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఓ వ్యక్తికి ఎక్మోతో చికిత్స చేసి పునర్జన్మనిచ్చారు షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు. గతనెల పరవాడ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో హైడ్రోజన్ సల్ఫైడ్‌ను పీల్చి ప్రాణాపాయ స్థితిలో కిమ్స్ ఆస్పత్రిలో చేరిన కార్మికుడికి క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ ఎం.రవికృష్ణ ఆధ్వర్యంలో వైద్య బృందం పలు చికిత్సలు చేశారు. ప్రమాద తీవ్రతను గుర్తించి ఎక్మో మిషన్ ద్వారా శరీరం నుంచి రక్తాన్ని బయటకు తీసి అందులో ఆక్సిజన్ నింపి మళ్లీ ఎక్కించారు. దీనివల్ల విష ప్రభావం తగ్గి గుండె, ఊపిరితిత్తులు సంపూర్ణంగా పనిచేయడం ప్రారంభించాయి. సుమారు రెండు వారాల పాటు వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్న కార్మికుడికి మంగళవారం డిశ్చార్జి చేసినట్టు వైద్యులు తెలిపారు. ఎక్మో చికిత్సలో పాల్గొన్న వైద్యులు కేఎస్ ఫణీంద్రకుమార్, ఎన్.సాయి మణికందన్, తదితరులకు కార్మికుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచే క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

చందనోత్సవానికి సిద్ధం

సింహాచలేశుడి చందనోత్సవానికి సర్వం సిద్ధమయింది. భక్తులు స్వామిని నిజరూపంలో దర్శించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ అధికారులకు సూచనలిచ్చారు. భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవం సందర్భంగా సింహగిరిని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


చందనోత్సవం ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

చందనోత్సవం సందర్భంగా సింహగిరిపై విద్యుత్ దీపాలంకరణ




అప్పన్న దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు


క్యూలైన్‌లో జల్లీఫైష్ ఆడుకుంటున్న భక్తులు


ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్

'ఆంధ్రజ్యోతి' చందనోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' రూపొందించిన ప్రత్యేక సంచికను మంగళవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచలం క్షేత్రంతో పాటు అనుబంధ ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేయనున్నామన్నారు.త్వరలోనే కొండపై భక్తులకు కాటేజీలు అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. శ్రీకృష్ణాపురంలో సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి త్రిదండి చినజీయరుస్వామి సూచనలిస్తారని, ఆ మేరకు పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణారావు, బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, యాడ్స్ విభాగం మేనేజర్ చక్రవర్తి, సర్క్యులేషన్ విభాగం డిప్యూటీ మేనేజర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. చిత్రంలో 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణారావు, బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు, సంస్థకు చెందిన పలు విభాగాల అధిపతులు ఉన్నారు

పారిశ్రామికవేత్తలు ఎప్పటికీ రిటైర్ కారు

» సీఐఐ చైర్మన్ డీవీఎస్ నారాయణ రాజు


సదస్సుకు హాజరైన వారితో సీఐఐ ప్రతినిధులు

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు ఎప్పటికీ రిటైర్ కారని, నిరంతరం భారీ లక్ష్యాల కోసం కలలు కంటారని సీఐఐ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ డీవీఎస్ నారాయణ రాజు అన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సోమ, మంగళ వారాల్లో వర్క్‌షాపు నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలో కలిసి పనిచేయాలంటే సూక్ష్మ పరిశ్రమల నిర్వాహకులు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. సదస్సుకు హాజరైన వారిలో 50 మందిని గుర్తించి సప్లయ్ చైన్ పరిశ్రమలతో అనుసంధానం చేస్తామన్నారు. కార్యక్రమంలో చిలుకూరి హెల్త్‌కేర్ ఎండీ డాక్టర్ అవినాష్, వివత్ర ఇండస్ట్రీస్ డైరెక్టర్ జీవన్‌జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గుణుపూర్, భవానీపట్నకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు విశాఖ-గుణుపూర్ పాసింజర్ (58506), గుణుపూర్-విశాఖ పాసింజర్ (58505) రైళ్లకు అదనంగా ఒక స్లీపర్ క్లాసు కోచ్, విశాఖ-భవానీపట్న పాసింజర్ (58504), భవానీపట్న-విశాఖ పాసింజర్ (58503) రైళ్లకు అదనంగా ఒక జనరల్ సీటింగ్ కోచ్ జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

చందనోత్సవంలో ప్రత్యేక వైద్య శిబిరాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అప్పన్న చందనోత్సవం నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పిజగదీశ్వరరావు తెలిపారు. కొండపైన ఎనిమిది, దిగువన ఏడు శిబిరాలు బుధవారం సాయంత్రం వరకు భక్తులకు సేవలందిస్తాయన్నారు. 16 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచామని, సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు ప్రత్యేక వైద్య నిపుణులు, మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారన్నారు. బస్టాండ్ అప్‌హిల్, పీఏసీ సెంటర్, రాజగోపు రం, పీఆర్వో ఆఫీస్, పాత శివాలయం, మ్యూజియం, అన్నదానం సెంటర్, 500 మెట్లు వద్ద కొండపైన శిబిరాలు ఏర్పాటు చేశారు. తొలి పావంచా, శ్రీనివాస్‌నగర్ కల్యాణ మండపం, పాతగోశాల జంక్షన్, పాతఅడవివరం జంక్షన్, రెండో టోల్‌గేట్, కృష్ణాపురం గోశాల, ఆర్‌హెచ్‌సీప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. కొండపైన పబ్లిక్ అమినీటీస్ సెంటర్‌లో ఆరు పడకలను ఉంచామన్నారు. అత్యవసర వైద్య సేవలకు 9949285370 నంబరులో సంప్రతించాలన్నారు.

సమస్యలపై ఎంఎల్‌హెచ్‌పీల ఆందోళన

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆరోగ్యశాఖలో పని చేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)లు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, మినిమం టైమ్‌స్కేల్, హెచ్‌ఆర్ పాలసీ, ఇన్సెం టివ్స్, పీఎఫ్ అమలుతోపాటు ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎంఎల్‌హెచ్‌పీ ప్రెసిడెంట్ ప్రజ్ఞ, వైస్ ప్రెసిడెంట్ అరుణ, సెక్రటరీ శాంతి లక్ష్మి, కోశాధికారి గంట సుధ తదితరులు పాల్గొన్నారు. వీరికి నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు శశిభూషణ్, అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు మోహన్ సంఘీభావం తెలిపారు.

'ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడండి'

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కేకే రాజుకు ఆపార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. తాడేపల్లిలో జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలు అమలుచేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాడి ప్రజల మద్దతు కూడగట్టాలని సూచించారు. జగన్‌ను కలిసిన వారిలో పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఉన్నారు.


మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కేకే రాజు

ఓమ్నీ హాస్పిటల్‌లో సయాన్ క్యాన్సర్ విభాగం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాధాకృష్ణ

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓమ్నీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధుని క పిల్లల క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్టు హాస్పిటల్స్ పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ కె.రాధాకృష్ణ, సయాన్ క్యాన్సర్ క్లినిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ శశి సుంకర్ తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేశంలోని క్యాన్సర్ కేర్ నెట్‌వర్క్ సయాన్ క్యాన్సర్ క్లినిక్స్ వివరాలను వెల్లడించారు. ప్రత్యేకంగా యుక్తవయసు వారికి అత్యాధునిక క్యాన్సర్ చికిత్సను అందించేందుకు దీనిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సేవలు ప్రారంభించడంతో ఓమ్నీ హాస్పిటల్స్ ఇప్పుడు అన్ని ప్రధాన పిల్లల ఆరోగ్య సేవలను ఒకేచోట అందిస్తూ, పిల్లలకు, వారి కుటుంబాలకు పూర్తి స్థాయి భరోసాను కల్పిస్తోందన్నారు. సయాన్ క్యాన్సర్ క్లినిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ శశి శంకర్ మాట్లాడుతూ ప్రపంచస్థాయి ప్రమాణాలతో ప్రత్యేకంగా పిల్లల కోసం మల్టీ డిసిప్లినరీ క్యాన్సర్ చికిత్స సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. పిల్లలకు అనుకూలమైన చికిత్స విధానాలను అత్యుత్తమంగా అందించే టీమ్ అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో సయాన్ క్లినిక్స్ ప్రతినిధులు డాక్టర్ భారతీ దేవి, డాక్టర్ రాఘవేంద్రనాయక్, డాక్టర్ వెంకటసుష్మ, డాక్టర్ గౌరి నాయుడు, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, సుభాష్, ఓమ్నీ ఆర్కే వైద్య నిపుణులు డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తొలి విడత చందన సమర్పణకు సర్వం సిద్ధం


చందనం ముద్దలో సుగంధ ద్రవ్యాల పొడిని కలుపుతున్న అర్చకులు

సింహాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30 నాటి సింహాద్రినాథుని నిజరూప దర్శనం చందనోత్సవంలో భాగమైన సహస్ర ఘటాభిషేకం తరువాత తొలివిడత చందన సమర్పణకు ఆలయ వైదికులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే అరగదీసిన మూడు మణుగుల (125 కిలోల) పచ్చిగంధపు ముద్దలో కచ్చేరాలు, వావిలాలు, కస్తూరి, పసుపు, కుంకుమపువ్వు వంటి సుగంధ ద్రవ్యాల చూర్ణాలను మంగళవారం స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు ఐవీ రమణాచార్యులు, ఉప ప్రధానార్చకులు కరి సీతారామాచార్యులు తదితరులు మిళితం చేశారు.